మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 19-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 140 Issue: 140

19 నవంబర్ 2025 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:26 సూర్యాస్తమయం - సా. 5:36 తిథి చతుర్దశి ఉ. 9:43 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం స్వాతి ఉ. 7:53 వరకు తరువాత విశాఖ యోగం సౌభాగ్య ఉ. 8:58 వరకు కరణం శకుని ఉ. 9:43 వరకు చతుష్పాద రా. 11:00 వరకు వర్జ్యం మ. 2:17 నుండి సా. 4:05 వరకు దుర్ముహూర్తం ఉ. 11:39 నుండి మ. 12:23 వరకు రాహుకాలం మ. 12:01 నుండి మ. 1:25 వరకు యమగండం ఉ. 7:50 నుండి ఉ. 9:14 వరకు గుళికకాలం ఉ. 10:37 నుండి మ. 12:01 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:50 నుండి తె. 5:38 వరకు అమృత ఘడియలు రా. 1:04 నుండి రా. 2:52 వరకు అభిజిత్ ముహూర్తం లేదుజ గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



## 'డిజిటల్'గా అంబేద్కర్ వర్సిటీ

సీఎం రేవంత్ సమక్షంలో ఎంఓయూ

2



## వాట్సాప్‌లో మీసేవ

హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు

580 పౌర సేవలు అందుబాటులో..

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

2

## ఫిట్‌నెస్ ఫీజులు 10 రెట్లు పెంపు

వాహనదారులకు కేంద్రం షాక్.. పదేళ్లు పూర్తయిన వెహికల్స్‌కూ వర్తింపు

పాత వాహనాల ఫిట్‌నెస్ టెస్ట్ ఫీజులను ఏకంగా పది రెట్లకు పైగా పెంచుతూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్‌కు ఐదో సవరణ చేస్తూ జారీ చేసిన ఈ కొత్త నిబంధనలు తక్షణం అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో వాహనాల వయసు, కేటగిరీని బట్టి ఫీజుల నిర్మాణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి.

2






## 10 రోజుల వైకుంఠ ద్వార దర్శనం

సామాన్య భక్తులకు ప్రాధాన్యం: టీటీడీ

164 గంటలు సామాన్యులకే

మొదటి 3 రోజులు రూ.300, శ్రీవాణి దర్శనాలు రద్దు

తిరుమల, నవంబర్ 18 (ఈవార్తలు): శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శుభవార్త అందించింది. ఈ ఏడాది వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలని నిర్ణయించింది. డిసెంబర్ 30వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు -2 వ పేజీలో...

# హిడ్మా హతం

మావోయిస్టుల మాస్టర్‌మైండ్ ఎన్‌కౌంటర్.. ఏపీలోని రంపచోడవరం అడవుల్లో మృతి

ఆయన భార్య, నలుగురు నక్సల్స్ కూడా.. 31 మంది అరెస్టు.. లొంగిపోయిన దేవ్‌జీ!



మావోయిస్టులకు భారీ దెబ్బ తగిలింది. మావోయిస్టుల మాస్టర్ మైండ్ మాడ్వి హిడ్మా హతమయ్యాడు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం అడవుల్లో మంగళవారం తెల్లవారుజామున జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో హిడ్మాతో పాటు ఆయన భార్య హేమ అలియాస్ రాజే, మరో నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. మారేడుమిల్లి మండల అటవీ ప్రాంతంలో ఉదయం 6.30 నుంచి 7 గంటల మధ్య ఎన్‌కౌంటర్ జరిగిందని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) అమిత్ బర్దార్ తెలిపారు. మృతుల్లో లక్మల్, కమ్లూ, మల్లా, దేవ్(హిడ్మా గార్డ్) ఉన్నారు. హిడ్మా మృతిని అటు ఛత్తీస్‌గఢ్ పోలీస్ శాఖతో పాటు ఇటు ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా వెల్లడించారు.

రంపచోడవరం, నవంబర్ 18 (ఈవార్తలు): ఎన్‌కౌంటర్ అయిన స్థలం నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు లడ్హా తెలిపారు. 'రెండు రోజుల కిందటే మాకు పక్కా సమాచారం వచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లో తలదాచుకునే అవకాశం లేకపోవడంతో ఏపీకి వచ్చే ప్రయత్నం చేశారు. మావోయిస్టుల కార్యకలాపాలపై నిఘా ఉంచాం' అని వెల్లడించారు. మావోయిస్టు ఉద్యమంలో అత్యంత కీలకమైన నేతగా గుర్తింపు పొందిన వ్యక్తి. ప్రస్తుతం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కంపెనీ వన్ కమాండర్‌గా ఉన్నారు. ఆయన స్వస్థలం ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లా తరువాయి 2 వ పేజీలో...



## 4 నెలల్లో నక్సలిజం అంతం

అర్బన్ నక్సల్స్ మాయలో పడొద్దు

వాళ్లంతా పట్టణాల్లో జల్సా చేస్తున్నారు

ఆస్తులు సంపాదించుకుంటున్నారు

అమాయకులే ప్రాణాలు కోల్పోతున్నారు

తుపాకీ పట్టుకొని చర్చలు అంటే కుదరదు

కేంద్ర హెూం సహాయ మంత్రి బండి సంజయ్

వేములవాడ ఆస్పత్రికి పరికరాలు అందజేత

'మావోయిస్టులారా.. 4 నెలలు మాత్రమే మీకు సమయం ఉంది. 2026 మార్చిలోపు మావోయిస్టులను అంతం చేయడమే మా లక్ష్యం. అమిత్ షా మాట ఇస్తే నిలబెట్టుకునే నాయకుడు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య సాధించిందేమిటి? అర్బన్ నక్సల్స్ మాయలో పడి మీ ప్రాణాలు తీసుకోవద్దు. అర్బన్ నక్సల్స్ ఏసీల్లో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు.

2



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,366 |
| వెండి (గ్రాము): | రూ.170 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,329 |

## తెలంగాణ వాటాగా 10%

3 ట్రిలియన్ డాలర్ల టార్గెట్‌కు మా మద్దతు.. 9న తెలంగాణ విజన్ 2047 డాక్యుమెంట్

మూడేళ్లలో మొత్తం ఎలక్ట్రిక్ బస్సులే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భారతదేశం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవడంలో తెలంగాణ రాష్ట్రం 10 శాతం వాటాను అందించాలని చూస్తున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాలను తరువాయి 2 వ పేజీలో...





## నేటి నుంచి చీరల పంపిణీ

డిసెంబర్ 9 వరకు కొనసాగనున్న ప్రక్రియ

రెండో దశలో మార్చి 1నుంచి మార్చి 8 వరకు

నెక్లెస్ రోడ్డులో ప్రారంభించనున్న సీఎం రేవంత్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరలు పంపిణీకి సర్వం సిద్ధమైంది. మాజీ ప్రధాని 'ఇందిరా గాంధీ' జయంతి సందర్భంగా ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల సాధికారత కోసం ప్రభుత్వం కోటి మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తోందని ఆయన చెప్పారు.

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): నెక్లెస్ రోడ్డులో మధ్యాహ్నం 12 గంటలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంను సీఎం ప్రారంభించనున్నారు. కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీర అందించనుంది. బుధవారం సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



దెబ్బతిన్న, స్పర్శ కోల్పోయిన నరాలను తిరిగి పూర్వ స్థితికి తెచ్చే ఇంజెక్టబుల్ జెల్‌ను ఎంఐటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దెబ్బతిన్న నరానికి ఈ జెల్ (ప్రత్యేకమైన సమ్మేళనం)ను ఎక్కించడం ద్వారా నరం రిపేర్ అయ్యి, సాధారణ స్థితికి వస్తుంది. జంతువులపై చేసిన ప్రయోగాల్లో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. మనుషులపై ప్రయోగాలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

## కేసీఆర్ తప్పుచేశారు



తుమ్మలను వదులుకోవడం పెద్ద తప్పిదం

నేను పార్టీ పెడితే అది వజ్రాయుధమే

ఖమ్మంలో కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు

మధిర/ఖమ్మం, నవంబర్ 18 (ఈవార్తలు): సీనియర్ నాయకుడు తుమ్మల నాగేశ్వరరావును వదులుకుని కేసీఆర్ పెద్ద తప్పు చేశారని తన తండ్రిపై కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఆయనను వదులుకున్నాకే రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయన్నారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రాకపోవడానికి ఇది కూడా ఒక కారణమని జనం బాట యాత్రలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్న ఆమె మధిరలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌లో ఉన్నన్ని రోజులు తనను నిజామాబాద్‌కే పరిమితం చేశారని చెప్పారు. అందుకే ఇప్పుడు తరువాయి 2 వ పేజీలో...



## డిసెంబర్ 3న సర్పంచ్ ఎన్నికలు

రెండోవారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి

2

## మళ్లీ బీసీలకు మోసం

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సరికాదు.. 42 శాతం రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలా?

బీసీలను రాజకీయంగా తొక్కేసే కుట్రలు.. బీసీ రిజర్వేషన్ సాధన సమితి మండిపాటు

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్‌లో గ్రామ పంచాయతి ఎన్నికలకు వెళ్లాలన్న నిర్ణయాన్ని బీసీ రిజర్వేషన్ సాధన సమితి తీవ్రంగా ఖండించింది. బీసీ వర్గాల న్యాయ పరమైన హక్కైన 42% రిజర్వేషన్లు చట్టబద్ధం చేయకుండా ఎన్నికలు జరపడం, బీసీ ప్రజలను మరోసారి మోసం చేసిన చర్యగా భావిస్తామని తెలిపింది. బీసీలను రాజకీయంగా ఎదగకుండా నిరోధించే కుట్ర అని మండిపడింది. రిజర్వేషన్ల కల్పనపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. పార్లమెంట్ సమావేశాల్లో రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తేలా రాహుల్ గాంధీతో మాట్లాడాలని, అవసరమైతే పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేసేలా తరువాయి 2 వ పేజీలో...



# రాశి ఫలాలు



19.11.2025

మేషం: వ్యాపారమున పెట్టుబడుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించాలి. ముఖ్యమైన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో చిన్నపాటి వివాదాలుంటాయి. బంధువులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

వృషభం: వ్యాపారాలు విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. దూరపు బంధువుల నుండి ఆశ్చర్యకరమైన విశేషాలు తెలుస్తాయి. ఉద్యోగాలలో ఆశించిన పదవులు పొందుతారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మిథునం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఆర్థికాభివృద్ధి కలుగుతుంది. బందుమిత్రులతో సక్యతగా వ్యవహారిస్తారు.

కర్కాటకం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. దూరప్రయాణాలు వాయిదా పడుతాయి. సోదరులతో స్థిరస్తి వివాదాలు కలుగుతాయి. దైవచింతన కలుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తప్పవు. ఆర్థిక పరిస్థితి కొంత నిరుత్సాహ పరుస్తుంది. సన్నిహితులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

సింహం: వ్యాపారాలలో స్వల్ప ఇబ్బందులుంటాయి. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్పదు. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. సన్నిహితులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

తుల: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. పాత మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో ఆకస్మిక మార్పులుంటాయి. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. రుణయత్నాలు వేగవంతం చేస్తారు.

ధనస్సు: వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. పాత ఋణాలు తీర్చడానికి నూతన రుణాలు చేయాల్సి వస్తుంది. ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి.

మకరం: నిరుద్యోగుల కష్టం ఫలిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. నూతన వస్తు లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో పురోగతి కలుగుతుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. ఋణగ్రస్తుల నుండి రావలసిన సొమ్ము వసూలవుతుంది.

కుంభం: చిన్ననాటి మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు దక్కుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహనిస్తాయి. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమౌతాయి.

మీనం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహ పరుస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు తప్పవు. నూతన రుణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఇంటాబయట గందరగోళ పరిస్థితులుంటాయి.

# మళ్లీ బీసీలకు మోసం

మొదటి పేజీ తరువాయి

చేయాలని డిమాండ్ చేసింది. లేకపోతే, బీసీలను మభ్యపెట్టే రాజకీయ నాటకంగా, ఒక బూటకపు చర్యగా భావించాల్సి వస్తుందని హెచ్చరించింది.

### రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్లు ఇవీ:

1. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి.
2. అన్ని పార్టీల నాయకులతో కలిసి ప్రధానమంత్రితో భేటీకి అపాయింట్మెంట్ తక్షణమే పొందాలి.
3. ఆ భేటీలో 42% బీసీ రిజర్వేషన్లకు కేంద్ర ఆమోదం తీసుకురావడం 9 వ షెడ్యూల్‌లో చేర్పించడము రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన బాధ్యత. ఇది కేవలం రాజకీయ హామీ కాదు, ఇది బీసీ వర్గాల రాజ్యాంగబద్ధ హక్కును రక్షించే పరీక్ష,

### ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ దొరక్కపోతే..

1. బీసీ రిజర్వేషన్ల అడ్డంకులకు బీజేపీ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి.
2. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా బంద్‌కు పిలుపునివ్వాలి,
3. కేంద్రం దిగి వచ్చే వరకు భారీ స్థాయిలో ప్రజా పోరాటం నిర్వహించాలి. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించి పార్లమెంట్ సమావేశాలు స్తంభింప చేయాలి.

# కేసీఆర్ తప్పుచేశారు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రమంతా తిరుగుతున్నానని అన్నారు. జాగృతిని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఏదో నామమాత్రంగా తాను పార్టీ పెట్టనని, తాను పార్టీ పెడితే మాత్రం అది వజ్రాయుధంలా ఉంటుందని వెల్లడించారు. తెలంగాణ ప్రజలకు అంతటి బలమైన పార్టీని అందిస్తానని స్పష్టం చేశారు. తొందరపడి పార్టీ పెట్టనని, పరిస్థితులు బట్టి నిర్ణయం తీసుకుంటానని వివరించారు. రాజకీయ పార్టీ గురించి ఇప్పుడే ఆలోచన చేయనని, ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉందన్నారు. తనకు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని మరోమారు స్పష్టం చేశారు. ఫ్రెంచ్ విప్లవం, తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ మలి ఉద్యమం స్ఫూర్తిగా తీసుకుని తాను ముందుకు సాగుతున్నానని ప్రకటించారు.

# 'డిజిటల్'గా అంబేద్కర్ వర్సిటీ

## సీఎం రేవంత్ సమక్షంలో ఎంవోయూ

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ (ఐడియా) ఏర్పాటుకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ మధ్య సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో మంగళవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు, సీఈఓ ప్రొఫెసర్ పీటర్ స్కాట్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణిలు పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు విద్యా వ్యవస్థను మరింత మెరుగ్గ మార్చాలన్న లక్ష్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తాజా ఒప్పందంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిజిటల్ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందనుంది. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి 'ఐడియా' అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్య అందించేందుకు వీలు కలుగుతుంది.

# ఫిట్‌నెస్ ఫీజులు 10 రెట్లు పెంపు

## వాహనదారులకు కేంద్రం షాక్.. పదేళ్లు పూర్తయిన వెహికల్స్‌కూ వర్తింపు

న్యూఢిల్లీ: పాత వాహనాల ఫిట్‌నెస్ టెస్ట్ ఫీజులను ఏకంగా పది రెట్లకు పైగా పెంచుతూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్‌కు ఐదో సవరణ చేస్తూ జారీ చేసిన ఈ కొత్త నిబంధనలు తక్షణం అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో వాహనాల వయసు, కేటగిరీని బట్టి ఫీజుల నిర్మాణంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు 15 ఏళ్లు దాటిన వాహనాలకు మాత్రమే అధిక ఫిట్‌నెస్ ఫీజులు వర్తించేవి. తాజా సవరణల ప్రకారం ఈ వయోపరిమితిని 10 ఏళ్లకు తగ్గించారు. అంటే, ఇకపై 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వాహనాలకు కూడా పెంచిన ఛార్జీలు వర్తిస్తాయి. అంతేకాకుండా, వాహనాల వయసును బట్టి ఫీజుల విధానాన్ని కూడా మార్చారు. గతంలో 15 ఏళ్లు దాటిన అన్ని వాహనాలకు ఒకే ఫీజు ఉండగా, ఇప్పుడు మూడు విభాగాలుగా వర్గీకరించారు. 10-15 ఏళ్లు, 15-20 ఏళ్లు, 20 ఏళ్లకు పైబడిన వాహనాలు అనే మూడు కేటగిరీలను ప్రవేశపెట్టారు. వాహనం వయసు పెరిగే కొద్దీ ఫీజు కూడా అదే స్థాయిలో పెరుగుతుంది. ఈ కొత్త విధానం ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, క్వాడ్రిసైకిల్స్, తేలికపాటి మోటారు వాహనాలు, మధ్యస్థ, భారీ వాణిజ్య వాహనాలకు వర్తిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ ఫీజుల పెంపు ప్రభావం ముఖ్యంగా వాణిజ్య వాహనాలపై తీవ్రంగా ఉండనుంది. 20 ఏళ్లకు పైబడిన ట్రక్కులు లేదా బస్సులకు ఫిట్‌నెస్ టెస్టింగ్ కోసం ఇప్పటివరకు రూ. 2,500 ఉండగా, దాన్ని ఏకంగా రూ. 25,000కు పెంచారు. అదే వయసున్న మధ్యస్థ వాణిజ్య వాహనాలకు ఫీజు రూ. 1,800 నుంచి రూ. 20,000కు చేరింది. వ్యక్తిగత వాహనాల విషయంలోనూ భారం తప్పలేదు. 20 ఏళ్లకు పైబడిన తేలికపాటి మోటారు వాహనాలకు (కార్లు) ఫీజును రూ. 15,000గా నిర్ణయించారు. అదేవిధంగా, 20 ఏళ్లు పైబడిన త్రీ వీలర్ వాహనాలకు (ఆటోలు) రూ. 7,000 చెల్లించాల్సి ఉంటుంది. 20 ఏళ్లకు పైబడిన ద్విచక్ర వాహనాలకు ఫీజు మూడు రెట్లకు పైగా పెరిగింది. గతంలో రూ. 600గా ఉన్న ఈ ఫీజు ఇప్పుడు రూ. 2,000కి చేరింది. 15 ఏళ్లలోపు వాహనాలకు సైతం ఫీజులు పెరిగాయి. రూల్ 81 ప్రకారం, మోటార్ సైకిళ్లకు రూ. 400, తేలికపాటి మోటారు వాహనాలకు రూ. 600, మధ్యస్థ, భారీ వాణిజ్య వాహనాలకు రూ. 1,000 చొప్పున ఫిట్‌నెస్ సర్టిఫికేషన్ ఫీజు వసూలు చేయనున్నారు. పాత వాహనాలను రోడ్ల పైనుంచి తొలగించాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# హిడ్మా హతం

మొదటి పేజీ తరువాయి

పూవర్తి గ్రామం. కిషన్‌జీ సారథ్యంలో హిడ్మా తొలి అడుగు పడింది. 25 ఏళ్ల కిందట ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. గతంలో భద్రతా బలగాలపై జరిగిన అనేక దాడులకు హిడ్మా నాయకత్వం వహించారు. ఆయన దళానికి అత్యంత శక్తివంతమైన టీంగా పేరుంది. హిందీ, గోండి, తెలుగు, కోయ, బెంగాలీ భాషలపై ఆయనకు పట్టుంది. చిన్నవయసులోనే కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నియ్యాడు. 2023లో దండకారణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన చనిపోయినట్లు ప్రచారం జరిగింది. ఆ వెంటనే ఫొటో రిలీజ్ చేసి పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టారు. అప్పటి నుంచి మావోయిస్టుల మూడంచెల భద్రతా వ్యవస్థ నడుమ క్షేమంగా ఉన్నట్లు సమాచారం. ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతా బలగాలు హిడ్మా కోసం ప్రత్యేకంగా ఆపరేషన్‌ను కొనసాగించాయి. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుగాంచిన హిడ్మా.. మూడు రాష్ట్రాలకు మోస్ట్‌వాంటెడ్‌గా మారారు. భారీ దాడుల్లో స్వయంగా పాల్గొంటూ కేంద్రానికి మోస్ట్ వాంటెడ్‌గా మారారు. ఎన్నోసార్లు చాకచక్యంగా భద్రతా బలగాల నుంచి తప్పించుకున్నారు. రెండు వారాల కిందటే ఆయన తల్లిని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, హోం మంత్రి కలిశారు. ఆయన్ని లొంగిపోయేలా ఒప్పించాలని ఆమెను కోరారు. 'ఇప్పటికైనా ఇంటికి రా బిడ్డా' అని ఆమె హిడ్మాను వేడుకున్నారు కూడా. ఈలోపే ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతి చెందడం గమనార్హం. హిడ్మాపై రూ.కోటికిపైగా రివార్డు ఉంది. ఆయన సతీమణి హేమపై రూ.50 లక్షల రివార్డు ఉంది.

### 26 దాడుల్లో హిడ్మా కీలక నిందితుడు

- 2007లో సుక్మా జిల్లా ఉర్పల్‌మెట్‌లో సీఆర్‌పీఎఫ్ జవాన్లపై దాడి చేసి, చంపారు.
- 2010లో తడ్‌మెట్ల మెరుపు దాడిలో 76 మంది జవాన్లు మృతి చెందారు.
- 2013లో జీరామ్‌ఘాటీ వద్ద కాంగ్రెస్ నేతలను ఊచకోత ఘటనలో హిడ్మాదే కీలక పాత్ర.
- 2017 ఏప్రిల్‌లో సుక్మా జిల్లాలో 27 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను హతమార్చాడు.
- 2021 ఏప్రిల్ 4న బీజాపూర్ జిల్లా తరెంలో హిడ్మా వ్యూహంలో చిక్కుకుని 23 మంది జవాన్లు మృతిచెందారు.

### దేవ్‌జీ లొంగుబాటు!

హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తూ పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మావోయిస్టు ఉద్యమంలో కీలక నేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పోలీసుల ఎదుట లొంగిపోయారని ఊహాగానాలు వస్తున్నాయి. కానీ దీనిపై పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. జగిత్యాల జిల్లా కోరుట్ల ఆయన స్వస్థలం. తిప్పిరి తిరుపతి దాదాపు 43 ఏండ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లారు. దళిత కుటుంబంలో పుట్టిన ఆయన.. ఇంటర్ వరకు కోరుట్లలోనే చదివారు. 1978 ప్రాంతంలో రైతుకూలీ పోరాటాలు, విద్యార్థి సంఘాలు, రాడికల్ స్టూడెంట్ యూనియన్ పోరాటాల్లో పాల్గొని కూలీరేట్ల పెంపుదలలో భాగస్వాములయ్యారు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాటం చేశారు. రాడికల్ స్టూడెంట్ యూనియన్ కోరుట్ల శాఖలో కీలకంగా ఉన్న ఆయన 1982లో ఆర్ఎస్‌యూ విద్యార్థులపై సాగిన మారణహోమంపై ఒగ్గుకథ రూపంలో ప్రచారం చేశారు. ఆరెస్సెస్, ఏబీవీపీ తిరుపతిపై పలుమార్లు దాడులకు దిగాయి.

అప్పట్నుంచే పీపుల్స్‌వార్ కార్యక్రమాల ప్రాధాన్యం వివరించడంతో ఆయనపై నిర్బంధం పెరిగిపోయింది. పలు కేసులతో జైలుకు సైతం వెళ్లారు. గణపతి కార్యదర్శిగా పీపుల్స్‌వార్ పార్టీ తన ప్రస్తానాన్ని కొనసాగించిన క్రమంలో మల్లోజుల కోటేశ్వర్‌రావు, నల్లా ఆదిరెడ్డి, శీలం నరేశ్, పులి అంజన్న, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, నంబాల కేశవరావు, మాధవ్, తిప్పిరి తిరుపతి కీలక భూమిక పోషించారు. పీపుల్స్‌వార్‌లో దళ సభ్యుడిగా ప్రస్థానం మొదలుపెట్టిన తిరుపతి, పార్టీలో అంచలంచెలుగా ఎదిగారు.

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కార్యదర్శిగా, ఛత్తీస్‌గఢ్ స్టేట్ కమిటీ మెంబర్‌గా, దళ కమాండర్‌గా, జోనల్ కమిటీ మెంబర్‌గా, స్టేట్ కమిటీ మెంబర్‌గా, ప్లాటూన్ కమాండర్‌గా పనిచేసినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం కేంద్ర మావోయిస్టు పార్టీ మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేస్తున్నట్టు సమాచారం. 2010వ సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో 74 మంది జవాన్ల మృతి ఘటనలో కీలక పాత్ర పోషించారు. పీపుల్స్‌వార్, మరికొన్ని విప్లవ గ్రూపులు కలిసి 2004లో మావోయిస్టు పార్టీగా అవతరించాయి. పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న గణపతి అలియాస్ ముప్పాల లక్ష్మణ్‌రావును మావోయిస్టు కేంద్ర కమిటీ తొలి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వృద్ధాప్యం నేపథ్యంలో గణపతి స్థానంలో నంబాల కేశవరావు కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు.

### 31 మంది అరెస్టు

విజయవాడ పరిసర ప్రాంతాల్లో 31 మంది మావోయిస్టులను అరెస్టు చేసిన పోలీసులు.. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా కొప్పవరంలో ఇద్దరు మావోయిస్టులను అరెస్టుచేశారు. అలాగే ఏలూరులో 15 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిలో చాలావరకు దేవ్‌జీ అనుచరులు ఉన్నట్లుగా తెలుస్తోంది.

# వాట్సాప్‌లో మీసేవ

## హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

బంజారాహిల్స్/హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు సేవలను మరింత సులభంగా అందించేందుకు ఒక విప్లవాత్మక చర్యగా మీ సేవా సర్వీసులను వాట్సాప్ ప్లాట్‌ఫారమ్‌లో ప్రవేశపెట్టింది. ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు ఆయన బంజారాహిల్స్ తాజ్ కృష్ణాలో లాంఛనంగా ప్రారంభించారు. మెటా, మీసేవా సంయుక్త భాగస్వామ్యంతో అమలులోకి వచ్చిన ఈ కొత్త వ్యవస్థ, 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన 580కి పైగా సేవలను సాధారణ చాట్ ఇంటర్‌ఫేస్ ద్వారా అందుబాటులోకి తెచ్చింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డిజిటల్ పాలనలో దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణను నిలబెట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మెటా- మీసేవ భాగస్వామ్యంతో రూపొందించినట్లు తెలిపారు. గవర్నెన్స్ అనేది ప్రజలను దూరంగా ఉంచే రాచరిక ధోరణి కాదని, ప్రజలను పాలనలో భాగస్వామ్యం చేస్తూ ప్రతి సేవను వారి గృహాల ముందువరకు తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ దిశ శ్రీధర్ బాబు అన్నారు. గత బీఆర్ఎస్ పాలన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా నడిచిందని, ప్రజల భాగస్వామ్యంతో టెక్నాలజీ ఆధారిత గుడ్ గవర్నెన్స్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. టెక్నాలజీని కేవలం సాఫ్ట్‌వేర్‌గా కాకుండా సమానత్వ సాధనంగా చూస్తున్నామని, రాష్ట్రంలోని చివరి వ్యక్తి వరకూ టెక్నాలజీ ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఏటా 10 లక్షల మంది యువతకు ఏఐ శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని చెప్పారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో తెలంగాణ ఇప్పటికే బెంచ్‌మార్క్‌గా నిలిచిందని మంత్రి వివరించారు. దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారంగా తెలంగాణ డిజిటల్ ఎక్స్ఛేంజ్, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుచేసిన ప్రత్యేకత తెలంగాణదేనని అన్నారు. 38 శాఖలకు చెందిన 580కు పౌర సేవలను వాట్సాప్‌లో ఫింగర్‌టిప్స్‌పై అందుబాటులోకి తేనటంతో ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ మోడల్‌ను అనుసరిస్తున్నాయని అన్నారు.

# నేటి నుంచి చీరల పంపిణీ

మొదటి పేజీ తరువాయి

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడనున్నారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ మొదలవుతుంది. చీరల ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా రెండు దశలుగా చీరల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తొలి దశలో గ్రామీణ ప్రాంతాల్లో చీరలను పంపిణీ ఉంటుంది. నవంబర్ 19 నుంచి డిసెంబరు 9 వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ చేయనున్నారు. రెండవ దశలో మార్చి 1నుంచి మార్చి 8 (అంతర్జాతీయ మహిళా దినోత్సవం) వరకు పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు ఇందిరమ్మ చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. ఎట్టి పరిస్థితుల్లో చీరల నాణ్యత విషయంలో రాజీపడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సాంకేతికను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు చెప్పారు. చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు.

# డిసెంబర్ 3న సర్పంచ్ ఎన్నికలు

## రెండోవారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి

పెగడపల్లి, నవంబర్ 18 (ఈవార్తలు): డిసెంబర్ 3వ తేదీన సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలో ఎంపీడీఓ కార్యాలయం లో నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఎన్నికల షెడ్యూల్‌పై అనవసర సందేహాలు వద్దని సూచించారు. పంచాయతీ పాలక వర్గం లేకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన మూడు వేల కోట్లు నిధులు వెనక్కి వెళ్ళే అవకాశం ఉందని అందువల్ల గ్రామాల అభివృద్ధి కోసం ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. అయితే, ఎన్నికల సంఘం ప్రకటించాల్సిన తేదీని ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

# 10 రోజుల వైకుంఠ ద్వార దర్శనం

మొదటి పేజీ తరువాయి

భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చని ప్రకటించింది. పది రోజుల దర్శన కాలంలో మొత్తం 182 గంటల సమయం ఉండగా, అందులో 164 గంటలను సాధారణ భక్తులకే కేటాయించారు. వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభమయ్యే మొదటి మూడు రోజులు (డిసెంబర్ 30, 31, జనవరి 1) రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. ఈ మూడు రోజులకు గాను ఈ-డిప్ లాటరీ పద్ధతిలో టికెట్లను కేటాయించనున్నారు. ఇందుకోసం నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. డిసెంబర్ 2న లాటరీ ద్వారా ఎంపికైన భక్తులకు టికెట్లు కేటాయిస్తారు. టీటీడీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌తో పాటు వాట్సాప్ ద్వారా కూడా పారదర్శకంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇక జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు రోజుకు 15,000 చొప్పున రూ.300 దర్శన టికెట్లను, 1,000 శ్రీవాణి టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. మరోవైపు, తిరుమల, తిరుపతి స్థానిక భక్తుల కోసం జనవరి 6, 7, 8 తేదీల్లో రోజుకు 5,000 చొప్పున ప్రత్యేక టోకెన్లు జారీ చేయనున్నారు.

# తెలంగాణ వాటాగా 10%

మొదటి పేజీ తరువాయి

చేరడానికి, డిసెంబర్ 9న 'రైజింగ్ తెలంగాణ విజన్ 2047' డాక్యుమెంట్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి, రాబోయే మూడేళ్లలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులనే నడుపుతామని హామీ ఇచ్చారు. ఈ విధంగా అన్ని రంగాలలో తెలంగాణను ఆదర్శంగా నిలబెట్టడానికి కేంద్రం సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో జరిగిన పట్టణాభివృద్ధి ప్రాంతీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌తో పాటు పలు రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ అభివృద్ధికి, ముఖ్యంగా ప్రతిష్టాత్మక 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టుకు కేంద్రం నుంచి తక్షణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అయితే.. ఈ ప్రాజెక్టును విజయవంతం చేయడానికి, ప్రామాణిక అనుమతులు, నిధుల మద్దతు విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం కావాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఉద్దేశించిన మూడు కీలక ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు తక్షణమే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అందులో మొదటిది మూసీ పునరుజ్జీవం.

# 4 నెలల్లో నక్సలిజం అంతం

**అమాయకులే ప్రాణాలు కోల్పోతున్నారు**
**తుపాకీ పట్టుకొని చర్చలు అంటే కుదరదు**
**కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్**
**వేములవాడ ఆస్పత్రికి పరికరాలు అందజేత**

వేములవాడ, నవంబర్ 18 (ఈవార్తలు): 'మావోయిస్టులారా.. 4 నెలలు మాత్రమే మీకు సమయం ఉంది. 2026 మార్చిలోపు మావోయిస్టులను అంతం చేయడమే మా లక్ష్యం. అమిత్ షా మాట ఇస్తే నిలబెట్టుకునే నాయకుడు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య సాధించిందేమిటి? అర్బన్ నక్సల్స్ మాయలో పడి మీ ప్రాణాలు తీసుకోవద్దు. అర్బన్ నక్సల్స్ ఏసీల్లో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పైరవీలు చేస్తూ ఆస్తులు సంపాదించుకుంటూ కార్లలో తిరుగుతున్నారు. మీరు మాత్రం అడవుల్లో తిండి తిప్పలు లేకుండా తుపాకీ పట్టుకుని తిరుగుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. అర్బన్ నక్సల్స్ చెప్పేదొకటి, చేసేదొకటి. వారి మాటలు నమ్మి మోసపోవద్దు. మంచి ఆలోచనలతో సమాజంలోకి రండి. ప్రజలకు సేవ చేయండి' అని కేంద్ర మంత్రి బండిసంజయ్ మావోయిస్టులకు పిలుపునిచ్చారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ఆసుపత్రికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ నేషనల్ మినరల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) సహకారంతో సీఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన రూ.1.5 కోట్ల విలువైన వైద్య పరికరాలను ఆసుపత్రికి అందజేశారు. జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ తోపాటు వైద్యశాఖ అధికారులతో కలిసి ఆ పరికరాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ పరిశీలించారు. ఆసుపత్రి అంతా కలియ తిరిగి రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'తుపాకీ ద్వారా రాజ్యాధికారం సాధ్యం కాదు. తుపాకీ పట్టుకుని అమాయకులైన దళిత, గిరిజనులను చంపారు. పోలీసులను చంపారు. మా ప్రతాప రామక్రిష్ణను కాల్చి చంపేందుకు యత్నించారు. చావుదాకా వెళ్లొచ్చారు. జాతీయ జెండా ఎగరేయొద్దని నక్సలైట్లు బీజేపీ నేతలను ఎంతోమందిని కాల్చి చంపారు. జాతీయ జెండా ఎగరేసేటోడు భారతీయుడా? నల్లజెండా ఎగరేసేటోడు భారతీయుడా? నక్సలైట్లది ఏ సిద్ధాంతం? తుపాకీ ద్వారా మీరు సాధించిందేమిటి? మీరు సాధించిందల్లా అమాయకులను పొట్టన పెట్టుకున్నారు. మీరూ బలైపోయారు? మేం బ్యాలెట్‌ను నమ్ముకుని ముచ్చటగా మూడోసారి దేశ ప్రజల ఆశీర్వాదంతో మోదీ ఆధ్వర్యంలో బీజేపీ అధికారంలోకి రాగలిగాం. మీరు తుపాకీ పట్టుకుని పోలీసులను, దళిత, గిరిజనులను చంపడం, మీరూ చనిపోవడం మినహా మీరు సాధించిందేమిటి? ఈ రోజు దేశంలో ఉన్నది ఆషామాషీ ప్రభుత్వం కాదు. మోదీ ప్రభుత్వం. దేశ సరిహద్దులో జవాను వద్ద, పోలీసుల వద్ద మాత్రమే తుపాకీ ఉండాలి. మావోయిస్టులను తుపాకులను వదిలి జన జీవన స్రవంతిలో కలవాలి. మావోయిజాన్ని అంతం చేయడమే మా లక్ష్యం. మావోయిస్టులు లొంగిపోవాలని అమిత్ షా అవకాశమిచ్చినా వినకుండా ప్రాణాలు కోల్పోతున్నారు. తుపాకీతో అసలు మీరు సాధించేదేమిటి? తుపాకీ పట్టుకుంటే కక్షమించే ప్రసక్తే లేదు. కలం పట్టి చదువుకునే అమ్మాయిలకు మాయమాటలు చెప్పి తుపాకులు పట్టి అడవుల్లోకి పంపితే.. తిండి తిప్పలు లేక తిరుగుతున్నారు. చనిపోతున్నారు. ఎవరైనా లొంగిపోతే వాళ్లపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారు. తుపాకీ పట్టుకుని చర్చలు జరుపుతామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదు. తుపాకీ వీడాల్సిందే. జన జీవన స్రవంతిలో కలవాల్సిందే. తుపాకీ వీడి జనంలోకి వచ్చే వారికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోంది. బుల్లెట్‌ను నమ్ముకుంటే ప్రాణాలు తీసుకోవడం మినహా మీరు

# ముగిసిన హిడ్మా శకం





ఇరవై ఏళ్లకు పైగా మావోయిస్టు ఉద్యమంలో కొనసాగి, బస్తర్ ఏరియాను కంచుకోటగా మలుచుకున్న మాడావి హిడ్మా, ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుగా భద్రతాదళాలకు కొరకురాని కొయ్యగా మారిన హిడ్మాను ఎట్టకేలకు అంతమొందించారు. మావోయిస్టు ఉద్యమంలో అందరిది ఒక దారైతే, హిడ్మాది మరో ప్రత్యేకమైన శైలి. అతడి దాడులు భయంకరంగా ఉండేవి. అదే సమయంలో దాడుల వ్యూహరచన, భద్రతా బలగాలకు కూడా అంతుచిక్కేది కాదంటే అతిశయోక్తి కాదు. బస్తర్ ఏరియాలోని గిరిజనులు మావోయిజం బాట పట్టడానికి ఇతడి స్ఫూర్తి కూడా ఒక కారణమే. అప్పటి వరకు మావోయిస్టు అగ్రనాయకత్వంలో ఏపీ, తెలంగాణకు చెందిన వారే ఉండేవారు. హిడ్మా రాకతో ఇది మారింది. మావోయిస్టుల్లో అత్యంత కీలకమైన పీఎల్‌జీఏ "బెటాలియన్ నం.1"కు కమాండర్‌గా ఎదిగాడు. ఇలాంటి ఓ కరడుగట్టిన మావోయిస్టు ఛత్తీస్‌గఢ్-ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని దట్టమైన మారేడ్‌మిల్లి అడవులలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఇతడితో పాటు భార్య రాజక్క, నలుగురు సన్నిహితులు కూడా హతమయ్యారు.

### క్రూరమైన దాడులకు మారు పేరు

2010 ఏప్రిల్‌లో తాడిమెట్లలో 74 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతి చెందారు. ఈ కాల్పుల ఘటన హిడ్మా ఆధ్వర్యంలోనే జరిగింది. మావోయిస్టు-భద్రతా దళాల చరిత్రలో అత్యంత దారుణమైన దాడిగా దీనిని అభివర్ణిస్తారు. ఈ దాడికి ప్లాన్ చేసిన వ్యక్తి హిడ్మా అని భావిస్తారు. దీంతో పార్టీలో ఒక్కసారిగా హిడ్మా శకం మొదలైంది. మావోయిస్టు గెరిల్లా దాడులకు వ్యూహకర్తగా హిడ్మాకు పేరుంది. 2013లో ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ నేతల కాన్వాయ్‌పై మావోయిస్టులు భారీ దాడి చేశారు. ఈ దాడిలో మాజీ మంత్రి మహేంద్ర కర్మ, కాంగ్రెస్ నేత నందకుమార్ పటేల్, ఇతర నేతలు, భద్రతా సిబ్బంది సహా 30 మంది మృతి చెందారు. దీని వెనక కూడా హిడ్మా హస్తం ఉందని అంతా నమ్ముతారు. ఈ దాడుల వల్లే దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ నుంచి మావోయిస్ట్ సెంట్రల్ కమిటీలో చేరాడు. బీజాపూర్, సుక్మా, దంతెవాడ, దక్షిణ బస్తర్ అంతటా మావోయిస్టుల కార్యకలాపాలకు నాయకత్వం వహించాడు. 2017లో బుర్కపాల్ దాడిలో 25 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. విన్నాలో, టేకులగూడ దాడుల్లో 21 మంది మరణించారు. అసాధారణ గెరిల్లా వ్యూహాలు హిడ్మా అటాకింగ్ స్టైల్. విద్య లేకపోయినా సాంకేతికతను అందిపుచ్చుకున్నాడు. ఒక ట్యాబ్లెట్, మొబైల్ ఫోన్, కొన్నిసార్లు కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు ఉంటాయని మాజీ సహచరులు చెబుతుంటారు. ఇప్పటి వరకు భద్రతా బలగాలు ఆరుసార్లు పట్టుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యాయి. ఈ ప్రయత్నాల్లో 100 మందికి పైగా జవాన్లు అమరులయ్యారు. ప్రతీసారి హిడ్మా పోలీసుల్ని తప్పించుకున్నాడు. ఇతడికి నాలుగు నుంచి ఐదు దశల సెక్యూరిటీ ఉ ంటుంది. ఇతడిని గుర్తించడం దాదాపుగా అసాధ్యంగా ఉండేది. పోలీసులు వద్ద 25 ఏళ్ల నాటి పాత ఫోటో మాత్రమే ఉంది. తన దళంలోని ప్రతి సభ్యుడితో నవ్వుతూ మాట్లాడుతూ, గౌరవిస్తూనే, భయంకరమైన దాడులు నిర్వహించేవాడు. కేంద్ర కమిటీలో ఎదిగిన ఏకైక తెలంగాణేతర గిరిజనుడు ఇతడే.

## 2015 గ్రూప్-2 రద్దు

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): 2015 గ్రూప్%-%2 నోటిఫికేషన్□పై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ నోటిఫికేషన్□కు సంబంధించి 2019లో టీజీపీఎస్సీ ఇచ్చిన సెలక్షన్ లిస్ట్□ను హైకోర్టు రద్దు చేసింది. ఓఎంఆర్ షీట్స్ రీవాల్యుయేషన్ చేసి, మళ్లీ సెలక్షన్ లిస్ట్ ప్రకటించాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. 8 వారాల్లో తుది లిస్ట్ ప్రకటించాలని టీజీపీఎస్సీకి డెడ్ లైన్ విధించింది హైకోర్టు. గ్రూప్-2 పోస్టుల భర్తీకి 2015లో టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2016 నవంబర్□లో రాత పరీక్షలు నిర్వహించి.. 2019లో గ్రూప్-2 నియమాకాలు చేపట్టింది టీజీపీఎస్సీ. అయితే.. 2015 గ్రూపు-2 ఓఎమ్ఆర్ షీట్ ట్యాంపరింగ్ జరిగిందని హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు 2025, నవంబర్ 18న తుది తీర్పు వెలువరించింది. 2015 గ్రూప్-2 పరీక్షకు సంబంధించి 2019లో టీజీపీఎస్సీ ఇచ్చిన సెలక్షన్ లిస్ట్‌ను రద్దు చేసింది. ఓఎమ్ఆర్ షీట్‌ను రీవాల్యుయేషన్ చేసి మళ్లీ సెలక్షన్ లిస్ట్ ప్రకటించాలని ఆదేశించింది. 8 వారాల్లో తుది లిస్ట్‌ను ప్రకటించాలని టీజీపీఎస్సీకి డెడ్‌లైన్ విధించింది హైకోర్టు. ఈ సందర్భంగా టీజీపీఎస్సీపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. టీజీపీఎస్సీ హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి పరిధి దాటి వ్యవహరించిందని చురకలంటించింది. వైట్నర్, దిద్దుబాటు ఉన్న జవాబు పత్రాలను మూల్యంకనం చేయడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఓఎంఆర్ ట్యాంపరింగ్ జరిగినట్లు తెలిసినా జవాబు పత్రాలను మూల్యంకనం చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు పేర్కొంది. సాంకేతిక కమిటీ సూచన ప్రకారం ఓఎమ్ఆర్ షీట్లను రీవాల్యుయేషన్ చేయాలని ఆదేశించింది. 8 వారాల్లో తుది లిస్ట్ ప్రకటించాలని టీజీపీఎస్సీకి డెడ్ లైన్ విధించింది.

# రైతులకు కాంగ్రెస్ ధోకా

## కరెంటు నుంచి కాంటా దాకా సమస్యలే.. ఎరువుల్లేవ్.. బోనస్ రాదు.. బీమా ఊసేలేదు

**రాష్ట్ర సర్కారుపై హరీశ్ రావు మండిపాటు**



వరంగల్, నవంబర్ 18 (ఈవార్తలు): కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సమయానికి ఎరువులందవు, కరెంటు సరిగ్గా రాదు, రైతుబంధు రాదు, రుణమాఫీ లేదు, బోనస్, పంటల బీమా ఊసేలేదని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మేలుకోకపోతే తెల్ల బంగారం పత్తిని తెచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ని హరీశ్ రావు సందర్శించారు. పత్తి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల, బీజేపీ తప్పుడు విధానాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. సీసీఐ తుగ్లక్ వంటి పిచ్చి నిర్ణయాలు తీసుకొని రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నది. ఎల్1, ఎల్2, ఎల్3 విధానం, కపాస్ యాప్‌లో 8 నుంచి 12 శాతం తేమ ఉండాలనే నిర్ణయాలతో రైతులు రోడ్ల మీద పడే పరిస్థితి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడ్డాయి. పత్తి రైతులంతా అయోమయంలో ఉన్నారు. ఈరోజు రైతులకు పత్తిని అమ్ముకోవడానికి అవకాశం లేక అడ్డగోలుగా దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. పత్తికి మద్దతు ధర రూ. 8,100. కానీ, రూ.6 వేలకే రైతులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. క్వింటాల్ మీద రూ.2000ల చొప్పున పత్తి రైతులు నష్టపోతున్నారు. మాటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరచేతిలో వైకుంఠం చూపించి, చేతల్లో నరకం చూపిస్తున్నాయి. వరదలు, తుఫాన్‌ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతే తుగ్లక్ నిర్ణయాలతో మరింత ఇబ్బంది పెట్టడం సరికాదు. 60 సార్లు ఢిల్లీకి పోయిన ముఖ్యమంత్రికి పత్తి రైతుల గురించి కేంద్రానికి విన్నవించే అవకాశం రాలేదా?. పత్తి రైతుల సమస్యలు కేంద్రానికి చెప్పే ఓపిక లేదా? సమయం లేదా?. రేవంత్ రెడ్డికి బడేభాయితో మంచి సంబంధాలే ఉన్నాయి కదా. ఎందుకని పత్తి రైతుల గురించి బడే భాయికి చెప్పడం లేదు. ఉప ఎన్నికల్లో గెలవడానికి విచ్చలవిడిగా డబ్బులు పంచిన రేవంత్ రెడ్డి పత్తి రైతులకు కనీస మద్దతు ధర అందించలేకపోతున్నారు. ఒకవైపు అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. పంట చేనులన్నీ దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 8 నుంచి 12 శాతం తేమ విధానాన్ని సవరించి, కపాస్ యాప్ ని రద్దు చేయండి. స్మార్ట్ ఫోన్లు లేకపోవడం వల్ల కపాస్ యాప్‌లో నమోదు చేయడం రైతులకు కష్టమైన పని. గత సంవత్సరం లాగానే 12 క్వింటాల పత్తి కొనాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచి ఏం చేస్తున్నారు?. పంట పొలాల్లో ఉండే దిష్టిబొమ్మలు బీజేపీ ఎంపీల కంటే నయం. అవి పంట పొలాల్లో కోతులు, పక్షులు రాకుండా కనీసం పనిచేస్తాయి. బీజేపీ ఎంపీలు ఒక్కసారి కూడా నోరు విప్పరు. రైతుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడగరు. కేసీఆర్‌ని, బీఆర్ఎస్‌ని తిట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు మరో పని చాతకాదు. కాంగ్రెస్ ప్రశ్నించదు. బీజేపీ అడగదు. బడా బడా పారిశ్రామికవేత్తలకు బీజేపీ లక్ష కోట్లు మాఫీ చేసింది. మరి పేద రైతులకు ఎందుకు మేలు చేయరు?. విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకుంటే నిబంధనలు సవరించి 11శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని రద్దుచేసి విచ్చలవిడిగా పత్తిని తెస్తున్నారు. కనీస మద్దతు ధరకు పత్తి అమ్ముకోలేని పరిస్థితి రైతులకు ఏర్పడింది. ఏమైనా అడుగుతే మోదీ ప్రభుత్వం విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకుంటుంది అని సమాధానం చెబుతున్నారు. రైతుకు మేలు చేసేది ఉంటేనే నిబంధనలు పెడతారా?. దళారుల కోసం, బడా బాబుల కోసం ఈ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులపై లాఠీచార్జులు పెరిగాయి. రెండేళ్ల పాలనా విజయోత్సవాలు ఎందుకు జరుపుతున్నారు రేవంత్ రెడ్డి?. రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టినందుకు విజయోత్సవాలు చేస్తున్నారా?. యూరియా బస్తాల కోసం రైతులను లైన్‌లో నిల్చోపెట్టినందుకు విజయోత్సవాలా?. ములుగు నియోజకవర్గంలో చింతకుంట, మంగపేట మండలాల నుంచి వచ్చిన రైతు వెంకటేశ్వర్లు, రైతు లక్ష్మయ్య మక్కలు అమ్మడానికి ఎనుమాముల మార్కెట్‌కి వచ్చారు. క్వింటల్ మక్కలు రూ.1800 కు రైతులు అమ్ముతున్నారు, రూ.2400 మక్కకు మద్దతు ధర. మక్క రైతులు ఒక క్వింటాలకు రూ.570 నష్టపోతున్నారు. ఎవరికైనా మక్క రైతులకు పైసలు విడుదల చేశారా అని మార్క్ ఫెడ్ అధికారులను అడిగితే.. రాష్ట్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా విడుదల చేయలేదని సమాధానం ఇచ్చారు. పోయిన యాసంగిలో రైతులకు రావలసిన రూ.1,100 కోట్ల బోనస్‌ని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం ఈ సంవత్సరం కొన్న రైతులకు కూడా రూ.1,400 కోట్ల బకాయిలు పడ్డాయి. పంటల భీమా తెస్తామన్న కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు అయినా పంటల బీమాను రైతులకు అందించడంలో విఫలమైంది. పంటల బీమా ఉండి ఉంటే నష్టపోయిన పంటకు రైతులకు నష్టపరిహారాలు అందేది కదా. బోనస్ ఎగ్గొడివితి. రైతుబంధు రెండు పంటలకు ఎగబెట్టింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. కరెంటు నుండి కాంట దాకా అన్నీ సమస్యలే. కరెంటు లోవోల్టేజ్ వల్ల ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయి. కాంటాకు వస్తే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవక, తెరిచినా కొనక దళారుల పాలైతున్నది ధాన్యం. ఎరువులందవు. విత్తనాలు అందవు. కరెంటు సరిగ్గా రాదు. రైతుబంధు రాదు. రుణమాఫీ జరగదు. బోనస్ ఎగ బెడతావు. పంటల బీమా లేదు. ఇంతే కదా రేవంత్ రెడ్డి. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా?' అని ప్రశ్నించారు.

# తెలంగాణకు అవార్డుల పంట

## 6వ జాతీయ జల అవార్డులు.. ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

న్యూఢిల్లీ, హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం టాప్‌లో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు-2024లో.. తెలంగాణ జాతీయ స్థాయిలో తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ మొత్తం 5,20,362 పనులు పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇవాళ (నవంబర్-18న) పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు. క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు. మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ.2 కోట్లు, రెండో దాని కింద కోటి రూపాయలు, మూడో కేటగిరీ కింద రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ-1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నగదు బహుమతి అందింది. ఆదిలాబాద్, నల్లగొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు.. హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. రూ.2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకొంది. ఈ విభాగంలో కేటగిరీ-2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి. కేటగిరీ-3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1, 3 ర్యాంకుల్లో నిలిచి.. రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి.

### అవార్డులు అందుకున్న వారి వివరాలు

డా.శ్రీజన, ఐఏఎస్, పీఆర్, ఆర్డీ కమీషనర్
కే.అశోక్ కుమార్ రెడ్డి, ఎండీ,
హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్
రాజర్షి షా, ఐఏఎస్, కలెక్టర్, ఆదిలాబాద్
జే.శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్, నల్లగొండ
కుమార్ దీపక్, ఐఏఎస్, కలెక్టర్, మంచిర్యాల
డాక్టర్ సత్యశారద, ఐఏఎస్, కలెక్టర్, వరంగల్
అభిలాష అభినవ్, ఐఏఎస్, కలెక్టర్, నిర్మల్
రిజ్వాన్ భాషా షేక్, ఐఏఎస్, కలెక్టర్, జనగామ
జితేష్ వీ పాటిల్, ఐఏఎస్, భద్రాద్రి కొత్తగూడెం
బి.విజయేందిర, ఐఏఎస్, కలెక్టర్, మహబూబ్ నగర్.

# హిజ్రాల్లో ఆధిపత్య పోరు

బోరబండ/హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బోరబండలో హిజ్రాలు నిర్వహించిన నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఆందోళనలో అపశ్రుతి చోటుచేసుకుని ఏడుగురు హిజ్రాలు తీవ్రంగా గాయపడ్డారు. గ్యాంగ్ లీడర్ మోనాలిసా తమపై దాడి చేస్తోందంటూ పలువురు హిజ్రాలు ఈ నిరసన చేపట్టారు. బోరబండ ప్రాంతంలో గ్యాంగ్ లీడర్‌గా ఉన్న మోనాలిసా వర్గానికి, పద్మ వర్గానికి మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. మోనాలిసా తమపై దాడులు చేస్తూ, వేధింపులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ పద్మ వర్గానికి చెందిన హిజ్రాలు సోమవారం బోరబండ బస్టాప్ వద్ద ప్లకార్డులతో నిరసనకు దిగారు. సుమారు గంటపాటు నిరసన తెలిపిన తర్వాత, వారు వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నారు. లైటర్లతో నిప్పు అంటించి, ఆర్పుతూ ఆత్మహత్యాయత్నం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో అప్పారావు (57 శాతం), హీనా ఖాతూన్ (54శాతం), నవనీత (54 శాతం), సాయిశ్రీ (42 శాతం), మోక్షిత (42శాతం), దీపా సుధ (36శాతం), ప్రవళిక (18 శాతం), దివ్యశ్రీ (8 శాతం) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే మోతీనగర్‌లోని సన్‌షైన్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఇతర ఆసుపత్రులకు తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే అదనపు డీసీపీ గోవర్ధన్, పంజాగుట్ట ఏసీపీ మురళీధర్, ఇతర పోలీస్ అధికారులు ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పిస్తా హౌస్, షా గౌస్‌పై ఐటీ పంజా

**15 చోట్ల ఏకకాలంలో తనిఖీలు**

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): హైదరాబాద్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రముఖ హోటల్స్ పిస్తా హౌస్, షా గౌస్ లక్ష్యంగా మంగళవారం జరిగాయి. రెండు సంస్థలకు సంబంధించి ఏకకాలంలో 15 ప్రాంతాల్లో ఐటీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. వివిధ బృందాలుగా విడిపోయిన అధికారులు.. పిస్తా హౌస్, షా గౌస్ కార్యాలయాలతో పాటు వాటి ఛైర్మన్లు, డైరెక్టర్ల నివాసాల్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల సందర్భంగా అధికారులు పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకుని, వాటిని పరిశీలించినట్లు సమాచారం. పన్ను చెల్లింపులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది.

# ఐవీఎఫ్ వికటించి కవలలు, భార్య మృతి

**తట్టుకోలేక భర్త ఆత్మహత్య.. శంషాబాద్‌లో విషాదం**

ఐవీఎఫ్ చికిత్స తీసుకుని, కవల పిల్లల కోసం ఆనందంగా ఎదురుచూస్తున్న ఆ దంపతుల జీవితం, కొద్ది గంటల్లోనే విషాదాంతమైంది. కడుపులోనే కవలలు కన్నుమూయడంతో ఆ షాక్‌కు తట్టుకోలేక నిండు గర్భిణి అయిన భార్య కూడా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. అయితే ప్రేమగా చూసుకున్న భార్య, కలలుగన్న కవలలు కనుమరుగు కావడంతో ముత్యాల విజయ్ గుండె పగిలిపోయింది. శోకసంద్రంలో మునిగిన ఆ భర్త.. తన జీవితం ఇక శూన్యమని భావించి, శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారక ఘటన ఆ ప్రాంతాన్ని కన్నీటిలో ముంచేసింది. బెంగళూరుకు చెందిన ముత్యాల విజయ్ (40), అతని భార్య శ్రావ్య (35) ఏడాదిన్నర కిందట శంషాబాద్‌కు వలస వచ్చి స్థిరపడ్డారు. విజయ్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు. సంతానం లేని ఈ దంపతులు ఐవీఎఫ్ చికిత్స ద్వారా గర్భం దాల్చారు. అందులోనూ కవలలు పెరుగుతున్నారని తెలియడంతో వారి ఆనందానికి అవధులు లేవు. దాదాపు ఎనిమిది నెలల గర్భిణి అయిన శ్రావ్యతో ఆ ఇల్లు సంతోషంతో నిండిపోయింది. కవలల రాక కోసం ఇద్దరూ ఎన్నో ప్రణాళికలు వేసుకున్నారు. అయితే, 2025 నవంబర్ 16వ తేదీ రాత్రి, శ్రావ్యకు అకస్మాత్తుగా కడుపు నొప్పి మొదలైంది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే అత్తాపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు చెప్పిన విషయం ఆ దంపతులకు పిడుగుపాటు లాంటిది. గర్భంలో పెరుగుతున్న కవలలు ఇద్దరూ మృతి చెందారని వైద్యులు ధృవీకరించారు. ఈ తీవ్ర ఆఘాతం తట్టుకోలేక శ్రావ్య అక్కడే స్పృహ కోల్పోయింది. మెరుగైన వైద్యం కోసం ఆమెను గుడిమల్కాపూర్‌లోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూనే శ్రావ్య తుదిశ్వాస విడిచింది. భార్య, కలలుగన్న కవలలు కొద్ది గంటల వ్యవధిలోనే దూరమవడంతో భర్త ముత్యాల విజయ్ పూర్తిగా కుంగిపోయాడు. తీరని బాధతో సోమవారం తెల్లవారుజామున శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే విజయ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

# 21న ఎన్‌హెచ్‌ల దిగ్బంధం

**అన్నదాతలంతా తరలి రావాలి**

**కేంద్రంపై ఒత్తిడి తీసుకొద్దాం**

**ఆదిలాబాద్‌లో పిలుపునిచ్చిన కేటీఆర్**

ఆదిలాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమానికి ఆదిలాబాద్ అన్నదాతలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతాంగం ముఖ్యంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, సోయా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రైతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని పక్కన పెట్టిందని, కనీసం పండిన పంటలను అమ్ముకోవడంలో కూడా సహకారం అందించడం లేదని తెలిపారు. రైతులతో మాట్లాడిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు అని అంటే ఎందుకు ఈ రోజు అదిలాబాద్ మార్కెట్ యార్డ్‌ని బంద్ పెట్టారు. మార్కెట్ యార్డులో రైతన్నలను కలుస్తామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డంకులు కల్పించింది. చరిత్రలో ఎప్పుడు లేనంత దారుణంగా పత్తి కొనుగోలు సోయా రైతుల పరిస్థితి మారింది. కిసాన్ కపాస్ మొబైల్ అప్లికేషన్ అని తీసుకువచ్చి దాని ద్వారానే పంటలు కొంటాం అంటున్నారు. మరి కనీసం ఫోన్లు లేని రైతన్నల పరిస్థితి ఏమిటి? ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ అన్నిచోట్ల ఉండదు. మరి ఇలాంటి సందర్భంలో రైతన్నల పరిస్థితి ఏమిటో చెప్పాలి అని కేటీఆర్ అడిగారు. రాష్ట్రంలో భారీగా అకాల వర్షాలు పడినందు వలన పత్తి తేమశాతం ఎక్కువగా ఉన్నది. చలి కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నది అందుకే పత్తిలో తేమశాతం ఉన్నది. గతంలో మా ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం పైన ఒత్తిడి తీసుకొచ్చి 20 నుంచి 22 శాతం తేమ ఉన్న పంటను కూడా కొనిపించాము. కానీ ఇప్పుడు కేవలం 12 శాతం తేమ ఉంటే కూడా కొనుగోలు చేయము అని చేతులు ఎత్తేసింది. రైతులు పంటలు అమ్ముకోలేక ఆత్మహత్యలు చేసుకుంటే కూడా పట్టించుకునే వారు లేరు కనీసం అడిగే వారు కూడా లేరు. కనీసం ఇప్పటిదాకా లక్ష క్వింటాళ్ల పంట కూడా కొనలేదు. ప్రైవేట్ వాళ్లతో ప్రభుత్వం కుమ్మక్కై రైతుల పంటను దోచుకుంటున్నది అని అనిపిస్తున్నది. లేకుంటే రైతన్నలకు ఎన్ని సమస్యలు వచ్చిన స్పందించకుండా ఉండదు అని కేటీఆర్ పేర్కొన్నారు. కనీస మద్దతు ధర రూ. 8,100 రైతుకు దక్కాల్సింది కానీ ఐదారు వేలు కూడా దక్కడం లేదు. సోయాబీన్ అమ్మకానికి సంబంధించి ఫింగర్ ప్రింట్ కావాలని చెప్పి ఒక నిబంధన పెట్టి అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారు. సొంత తల్లిదండ్రుల పేరు మీద ఉన్న పంటలు బిడ్డలు అమ్మాలంటే కూడా కొనుగోలు చేయడం లేదు. పత్తి పంట ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొంటామనే ఒక అర్థరహితమైన నిబంధన పెట్టారు. ఆదిలాబాద్‌లో ఉన్న భూసార పరిస్థితుల వలన పది పదిహేను క్వింటాళ్ల వరకు ఎకరానికి పండుతుంది మరి మిగిలిన పంటను ఎక్కడ అమ్ముకోవాలి. ఈరోజు మేము రైతన్నలను కలవడానికి వెళ్తున్నామని తెలుసుకున్న ప్రభుత్వం నాటకాలు మొదలుపెట్టారు అని కేటీఆర్ మండిపడ్డారు.

# హిడ్మాది ఫేక్ ఎన్‌కౌంటర్: కూనంనేని

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): మావోయిస్టులను చంపుకుంటూ పోవడమంటే మానవ హననం తప్ప మరొకటి కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు జంగిల్ రాజ్ పరిపాలనకు పరాకాష్ట అని వారన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల పోలీసులు కూడా ఇందులో పావులుగా మారారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మాడేరుమిల్లిలో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్, అంతకంటే ముందు మావోయిస్టులపై జరిగిన ఎన్‌కౌంటర్స్ మొత్తం ఫేక్ ఎన్‌కౌంటర్స్ అని కూనంనేని పేర్కొన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లతో మనుషులను చంపుకునే వ్యవస్థ ప్రపంచంలో ఎక్కడా లేదని, మావోయిస్టులు ఏదైనా నేరాలు చేసివుంటే వారిని అరెస్టు చేసి చట్టబద్ధంగా విచారణ జరిపించాలని ఇలాంటి ఫేక్ ఎన్‌కౌంటర్‌లు చేయడం విచారకరమని అన్నారు. మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.



# మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

**ప్రభుత్వ పథకాలతో సత్ఫలితాలు**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి**

జగిత్యాల టౌన్, నవంబర్ 18 (ఈవార్తలు): మహిళలను ఆర్థికంగా బలపడే దిశగా ప్రభుత్వం చేపట్టిన పథకాలు రాష్ట్ర వ్యాప్తంగా సత్ఫలితాలు ఇస్తున్నాయని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల్లో నిర్వహించిన మెగా ఋణ మేళాలో పాల్గొన్న మంత్రి, మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, వడ్డీరహిత రుణాలు, సోలార్ ప్లాంట్లు వంటి పథకాలు మహిళల పురోగతికి గణనీయంగా తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో రుణ చెల్లింపు 0 శాతం ఎన్ పి ఏ తో ముందంజలో ఉండటం ప్రశంసనీయమని అభినందించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలకు బ్యాంకుల ద్వారా పెద్దఎత్తున రుణాల మంజూరు అభినందనీయం అన్నారు. జిల్లాలో ఆర్ ఎస్ ఈ టి ఐ కేంద్ర స్థాపన అవసరమని సూచించారు. కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 15,244 మహిళా సంఘాలు, 1.77 లక్షల సభ్యులు ఉన్నారని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్ణయించిన రూ.770 కోట్ల లక్ష్యంలో 70 శాతం రుణాల పంపిణీ పూర్తయిందన్నారు. సమాఖ్యల 15 అద్దె బస్సుల ద్వారా రూ.42 లక్షలు, యూనిఫాంలు కుట్టడం ద్వారా రూ.78.79 లక్షల ఆదాయం వచ్చినట్లు వివరించారు. జగిత్యాల-మేడిపెల్లిలో రెండు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా 350 మహిళా సంఘాలకు రూ.36 కోట్ల జంబో చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీ రాజగౌడ్, యూబీఐ అధికారులు, డీఆర్డీఏ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బద్ది పోచమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ, నవంబర్ 18 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆనవాయితీ ప్రకారం సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న వేల మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో జనం తరలి రావడంతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకుపైగా సమయం పట్టింది.





# నల్లగొండ నర్సన్న కోరె మీసాల వేలం

కొడిమ్యాల, నవంబర్ 18 (ఈవార్తలు): నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పట్టెనామాలు, కోరెమీసాలు, కొబ్బరి ముక్కలు పోగుచేసుకొనేందుకు ఆలయ ఈవో ఉడతల వెంకన్న బహిరంగ టెండరు ప్రకటనను విడుదల చేశారు. ఈ నెల 27న టెండరు ఉంటుందని తెలిపారు. దేవస్థానం వద్ద టెండరు ఫారాన్ని రూ.200 చెల్లించి కోడ్ చేసి, 27 ఉదయం 10:30 గంటలలోగా సీల్ బాక్స్‌లో వేయాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం 1 గంటకు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ టెండరుకు వచ్చే ఏడాది జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు కాలపరిమితి ఉంటుందని పేర్కొన్నారు.



## మూఢ నమ్మకాలు వీడండి

**మత్తును తరిమి కొట్టండి**

**ట్రాఫిక్ నియమాలు పాటించండి**

**సైబర్ భద్రతను పెంచుకోండి**

**జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్**

జగిత్యాల టౌన్, నవంబర్ 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ప్రజల్లో సామాజిక అంశాలపై చైతన్యం పెంపొందించేందుకు పోలీసులు నిరంతరం వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. 2016 నుంచి జగిత్యాల పోలీస్ కళా బృందం జిల్లా వ్యాప్తంగా మానవ విలువలు, అభివృద్ధి, మూఢ విశ్వాసాలు- మత్తు వ్యసన నిర్మూలన, చట్టాలపై అవగాహన, సైబర్ భద్రత, మహిళా భద్రత, ట్రాఫిక్ నియమాలు వంటి అంశాలపై పాటలు-నృత్యాల రూపంలో ప్రభావవంతమైన సందేశాలను అందిస్తోందని తెలిపారు. పోలీస్ కళా బృందం ద్వారా గత 10 నెలల కాలంలో 150 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు వెల్లడించారు. విస్తృత అవగాహన కార్యక్రమాల ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆలోచనా విధానంలో, సామాజిక వ్యవహారాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు. మూఢ విశ్వాసాలు తగ్గుముఖం పడుతున్నాయని పేర్కొన్నారు.



## నేడు పుట్టపర్తికి ప్రధాని మోదీ

పుట్టపర్తి, నవంబర్ 18 (ఈవార్తలు): పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ వేడుకలకు దేశవిదేశాల నుంచి భక్తులతో పాటు రాజకీయ, వ్యాపార రంగాల ప్రముఖులు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో పుట్టపర్తి పట్టణం మొత్తం కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. వీరితో పాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్ , అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, సత్యకుమార్ తదితరులు కూడా హాజరయ్యారు. ఈ ఉత్సవాలకే హైలైట్‌గా బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టపర్తికి రానున్నారు. ప్రధాని పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు ముగ్గురు ఐఏఎస్ అధికారులను ప్రత్యేకంగా నియమించింది. ఐఏఎస్ అధికారులు గోపాలకృష్ణ, గోవిందరావు, కల్యాణ్ చక్రవర్తిలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. వీరికి సహాయకంగా ఇతర జిల్లాలకు చెందిన ఒక జేసీ, 9 మంది డిప్యూటీ కలెక్టర్లను కూడా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

# కూలీల వేషంలో నక్సల్స్

**విజయవాడలో మావోయిస్టుల కలకలం.. ఒకే భవనంలో 27 మంది నక్సల్స్ అరెస్ట్**

**వారిలో 12 మంది మహిళలు, నలుగురు కీలక నేతలు**

విజయవాడ, నవంబర్ 18 (ఈవార్తలు): విజయవాడ నగర శివార్లలో మావోయిస్టుల కదలికలు తీవ్ర కలకలం రేపాయి. అత్యంత పకడ్బందీగా అందిన సమాచారంతో కేంద్ర, రాష్ట్ర బలగాలు సంయుక్తంగా చేపట్టిన భారీ ఆపరేషన్‌లో 27 మంది మావోయిస్టులు పట్టుబడ్డారు. కానూరు కొత్త ఆటోనగర్ ప్రాంతంలోని ఓ భవనాన్ని షెల్టర్‌గా మార్చుకుని కార్యకలాపాలు సాగిస్తున్న వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ జాయింట్ ఆపరేషన్‌లో కేంద్ర బలగాలతో పాటు ఆక్టోపస్, గ్రేహౌండ్స్ దళాలు పాల్గొన్నాయి. పోలీసు వర్గాల కథనం ప్రకారం, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఈ మావోయిస్టుల బృందం సుమారు పది రోజుల క్రితం విజయవాడకు చేరుకుంది. తాము కూలీ పనుల కోసం వచ్చామని స్థానికులను నమ్మించి, ఆటోనగర్‌లోని ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. అయితే, వీరి కదలికలపై అనుమానం రావడంతో నిఘా వర్గాలు సమాచారం సేకరించాయి. దీని ఆధారంగా బలగాలు మంగళవారం తెల్లవారుజామున ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని మెరుపుదాడి చేశాయి. ఈ ఆపరేషన్‌లో 12 మంది మహిళలు, నలుగురు కీలక స్థాయి నేతలతో పాటు 11 మంది మిలీషియా సభ్యులు,




సానుభూతిపరులను అరెస్ట్ చేసినట్లు అధికారులు ధృవీకరించారు. విచారణలో మావోయిస్టులు నగర శివార్లలో నాలుగు చోట్ల ఆయుధాలు, పేలుడు పదార్థాలతో కూడిన డంప్‌లను ఏర్పాటు చేసినట్లు కీలక సమాచారం లభించింది. దీంతో అప్రమత్తమైన బలగాలు ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. డంప్‌లను గుర్తించి స్వాధీనం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. మరోవైపు, మావోయిస్టులకు ఆశ్రయం కల్పించిన భవన యజమాని గత నెలన్నరగా విదేశాల్లో ఉన్నట్లు తేలింది. దీంతో భవన వాచ్‌మేన్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితమైన మావోయిస్టులు.. వ్యూహం మార్చి విజయవాడ వంటి కీలక నగరంలో స్థావరం ఏర్పాటు చేసుకోవడం భద్రతా వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నగరంలో ఉంటూ తమ కార్యకలాపాలను విస్తరించే ప్రణాళికలో భాగంగానే ఇక్కడికి వచ్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో విజయవాడతో పాటు పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అరెస్ట్ అయిన వారిని మరింత లోతుగా విచారించి, వారి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# టీటీడీకి నకిలీ సిఫారసు లేఖలు

**విజయవాడ సీపీకి మంత్రి సత్యకుమార్ పీఏ ఫిర్యాదు**



తిరుమల, నవంబర్ 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేరుతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) దర్శనాలకు సంబంధించిన నకిలీ సిఫారసు లేఖలు జారీ కావడం కలకలం రేపింది. ఈ మోసంపై మంత్రి కార్యాలయం పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. కొంతకాలంగా మంత్రి సత్యకుమార్ పేరుతో కొందరు వ్యక్తులు నకిలీ సిఫారసు లేఖలను సృష్టించి, భక్తులను మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నకిలీ లేఖల ద్వారా మోసపోయిన కొందరు బాధితులు నేరుగా మంత్రి కార్యాలయాన్ని సంప్రదించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విషయం తీవ్రతను గుర్తించిన మంత్రి పర్సనల్ అసిస్టెంట్ (పీఏ) వెంటనే స్పందించి విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబును కలిసి ఫిర్యాదు చేశారు. నకిలీ లేఖల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు స్వీకరించిన కమిషనర్, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో, టీటీడీ సిఫారసు లేఖల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులను నమ్మి భక్తులు మోసపోవద్దని మంత్రి కార్యాలయం సూచించింది. ఇలాంటి మోసపూరిత వ్యక్తుల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేసింది.

## పరకామణి సాక్షులకు భద్రత

**కీలక ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు**




అమరావతి, నవంబర్ 18 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరకామణి చోరీ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరైన టీటీడీ మాజీ సీవీఎస్వో సతీశ్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం... కేసులోని నిందితులు, సాక్షుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న రవికుమార్‌తో పాటు ఇతర సాక్షులందరికీ పూర్తిస్థాయి భద్రత కల్పించాలని ఏపీ సీఐడీ డీజీని హైకోర్టు ఆదేశించింది. కేసు విచారణ ముగిసేంత వరకు వారికి ఎలాంటి హాని కలగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. విచారణ సమయంలో అనవసర ఇబ్బందులు తలెత్తకుండా, సాక్షుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. పరకామణి చోరీ కేసు విచారణ జరుగుతున్న సమయంలోనే కొన్ని రోజుల క్రితం సతీశ్ కుమార్ మరణించడం తీవ్ర కలకలం రేపింది. మొదట అనుమానాస్పద మృతిగా నమోదైన ఈ కేసును, ఆ తర్వాత హత్య కేసుగా మార్చిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో సాక్షుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. కేసు తదుపరి విచారణను డిసెంబర్ 2వ తేదీకి వాయిదా వేసింది.

## నితీశ్ ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు, లోకేశ్



అమరావతి, నవంబర్ 18 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ బీహార్ పర్యటనకు వెళ్లనున్నారు. బీహార్ ముఖ్యమంత్రిగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా వారికి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఇరువురు నేతలు ఈ నెల 20వ తేదీన పాట్నాకు వెళ్లనున్నారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి నారా లోకేశ్ ఎన్డీఏ కూటమి తరఫున ప్రచారంలో చురుగ్గా పాల్గొన్న విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో ఆయన రాష్ట్రంలో పర్యటించి, పలు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతేకాకుండా, తన పర్యటనలో భాగంగా పలువురు బీహార్ పారిశ్రామికవేత్తలతో సమావేశమై చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని వచ్చిన ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ పాట్నా వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. 20వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో వారు పాల్గొని నితీశ్ కుమార్‌కు అభినందనలు తెలియజేయనున్నారు.



## కార్తీక మహోత్సవాల్లో సాంస్కృతిక ఉత్సవాలు

వేములవాడ, నవంబర్ 18 (ఈవార్తలు): కార్తీక మహోత్సవాల సందర్భంగా వేములవాడలోని భీమేశ్వర సదన్ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ తెలంగాణ ప్రభుత్వం, పరంపర సంస్థ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆంధ్రనాట్యం, పేరని శివతాండవ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సాంస్కృతిక వేడుకల్లో ఆచార్య గురు కళా కృష్ణ నాయకత్వంలో వారి శిష్య-ప్రశిష్యులు పుష్పాంజలి, దేవి స్తోత్రం, పంచలింగ స్తోత్రం, మేలప్రాప్తి, శివపంచలింగ శబ్దాలు తదితర నృత్యావిష్కరణలు అందించారు. ఈ కార్యక్రమంలో డీఈలు రఘునందన్, మైపాల్ రెడ్డి, జి శ్రావణ్ కుమార్, జయకుమారి, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.



## మల్యాల కస్తుర్బాలో ఏసీ తనిఖీ

మల్యాల, నవంబర్ 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కస్తూర్బా పాఠశాలను లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులు, సిబ్బంది హాజరు పట్టికను, హాస్టల్‌లోని వంటగది, స్టోర్ రూం లను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సమస్యలను, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ వసంత, ఎంపీడీవో స్వాతి, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ స్రవంతి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తిరుపతి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## కొండగట్టులో భక్తుల కిటకిట

మల్యాల, నవంబర్ 18 (ఈవార్తలు): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో కార్తీక మాసం చివరి మంగళవారం సందర్భంగా స్వామివారి దర్శనానికి భక్తజనం పోటెత్తింది. దీంతో దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. లడ్డు కౌంటర్ ఒకటే ఉండటంతో భక్తులు లైన్‌లో బారులు తీరారు. పార్కింగ్ స్థలం లేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



# మా కుటుంబాన్ని ముక్కలు చేస్తున్నారు!

## దయచేసి దర్యాప్తు చేపట్టండి.. మోదీ, అమిత్ షాకు లాలు పెద్ద కుమారుడి విజ్ఞప్తి

పాట్నా: తేజస్వి యాదవ్ సహాయకులు తమ కుటుంబాన్ని, పార్టీని ముక్కలు చేస్తున్నారని, అలాంటి ద్రోహుల వల్ల తమ తల్లిదండ్రులు కూడా మానసిక వేధింపులకు గురవుతున్నట్లు తెలిసిందని లాలు ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు దర్యాప్తునకు ఆదేశించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. లాలు కుటుంబంలో చీలికల నేపథ్యంలో తేజ్ ప్రతాప్ యాదవ్ స్పందించారు. తేజ్ ప్రతాప్ మాట్లాడుతూ, ముఖస్తుతి చేసేవారి కుట్రపూరిత రాజకీయాల వల్ల, ఆర్జేడీని బలమైన పార్టీగా మార్చడానికి ఎన్నో ఏళ్లు కష్టపడిన వారిని విస్మరిస్తున్నారని ఆరోపించారు. దురాశ, అహంకారంతో విర్రవీగుతున్న తేజస్వి సహాయకులు తన తల్లిదండ్రులు లాలు ప్రసాద్, రబ్రీదేవిలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిసిందని అన్నారు. తన తండ్రి ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఈ పరిస్థితుల్లో వారు ఒత్తిడిని తట్టుకోలేరని ఆయన అన్నారు. ఈ విషయంపై దర్యాప్తునకు ఆదేశించాలని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, బీహార్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నానని అన్నారు. తాను రాజకీయాల నుంచి వైదొలుగుతున్నానని, కుటుంబంతోనూ సంబంధాలను తెంచుకుంటున్నానని లాలు కుమార్తె రోహిణీ ఆచార్య అన్నారు. ఆర్జేడీ ఎంపీ సంజయ్ యాదవ్, తేజస్వి మిత్రుడు రమీజ్‌ఖాన్ కారణంగానే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. అనంతరం లాలూ మరో ముగ్గురు కుమార్తెలు కూడా పాట్నాలోని ఆయన ఇంటి నుంచి ఢిల్లీకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో తన కుటుంబంలో జరుగుతున్న గొడవలకు తేజస్వి సహాయకులే కారణమని తేజ్ ప్రతాప్ యాదవ్ ఆరోపిస్తున్నారు.



### ఎవరీ రమీజ్ నెమత్?

ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో మొదలైన విభేదాలు, ఆయన కుమారుడు తేజస్వి యాదవ్ ముఖ్య సలహాదారు రమీజ్ నెమత్ నేర చరిత్రను వెలుగులోకి తెచ్చాయి. తేజస్వి సోదరి రోహిణి ఆచార్య చేసిన బహిరంగ విమర్శలతో రమీజ్ పేరు తెరపైకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రమీజ్‌పై రెండు హత్య కేసులు సహా పలు తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. స్థానిక రికార్డుల ప్రకారం, యూపీలోని బలరాంపూర్ జిల్లాకు చెందిన రమీజ్‌పై సుమారు 12 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వాటిలో రెండింటిని న్యాయస్థానం కొట్టివేసింది. 2022 నాటి ఒక హత్య కేసులో జైలుకు వెళ్లిన ఆయన, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి నవంబర్ 20న కోర్టు తీర్పు వెలువడనుంది. ఇది కాకుండా, కౌశాంబి జిల్లాలో నమోదైన మరో హత్య కేసులో 2024 ఆగస్టులో అరెస్ట్ అయి, 2025 ఏప్రిల్‌లో బెయిల్ పొందారు. రమీజ్ నెమత్.. తేజస్వి యాదవ్‌కు అత్యంత సన్నిహితుడిగా, ఆయన కోర్ టీమ్‌లో సభ్యుడిగా ఉన్నారు. 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రచార బాధ్యతలు, ముఖ్యంగా సోషల్ మీడియా విభాగాన్ని ఆయనే చూసుకున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం లాలూ కుటుంబంలో మొదలైన అంతర్గత కలహాలకు తేజస్వి సలహాదారులైన సంజయ్ యాదవ్, రమీజ్ నెమత్‌లే కారణమని రోహిణి ఆచార్య ఆరోపించడం వివాదాన్ని మరింత పెద్దది చేసింది. రమీజ్.. యూపీకి చెందిన మాజీ ఎంపీ రిజ్వాన్ జహీర్ అల్లుడు. ఢిల్లీలో చదువుకున్న ఆయన, జామియా మిలియా ఇస్లామియా నుంచి ఎంబీఏ పట్టా పొందారు. రాజకీయాల్లోకి రాకముందు ఆయన క్రికెటర్‌గా ఢిల్లీ, ఝార్ఖండ్ తరఫున వివిధ స్థాయిల్లో ఆడారు. వివాహం తర్వాత మామ ఇంట్లోనే నివసిస్తూ స్థానికంగా ప్రాబల్యం పెంచుకున్నారు.

# ఎమోషనల్ మోడ్‌లో మోదీ

**ప్రజల విషయంలో ప్రధానిది సున్నిత మనసు**

**మరోసారి ప్రశంసించిన శశిథరూర్**

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశిథరూర్ మరోసారి ప్రశంసించారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమానికి తనను ఆహ్వానించారని, ఆ కార్యక్రమంలో ప్రధాని మోదీ భారత్ నిర్మాణాత్మక అభివృద్ధి గురించి ప్రసంగించారని ఆయన అన్నారు. మోదీ అనుకూల వ్యాఖ్యలు చేస్తూ ఆయన సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఆయన మరోసారి ప్రధానికి కితాబునిచ్చారు. "తాను ఎప్పుడూ ఎన్నికల మోడ్‌లో ఉంటానని అందరూ అంటారని"



మోదీ తన ప్రసంగం సందర్భంగా పేర్కొన్నారని తెలిపారు. ప్రజల సమస్యల విషయంలో ఆయన ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారని కితాబిచ్చారు. దేశంలో విద్యపై వలసవాద ప్రభావం ఏ విధంగా ఉందనే విషయం గురించి మోదీ చెప్పిన మాటలను ఆయన గుర్తు చేసుకున్నారు. వలసవాద ఆలోచనా విధానం నుంచి బయటపడాలంటే భారతదేశ వారసత్వం, భాషలు, విజ్ఞాన వ్యవస్థలను తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని శశిథరూర్ అన్నారు. ప్రధాని మోదీకి సంబంధించిన ఫొటోలను కూడా ఆయన సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. శశిథరూర్ చేసిన ఈ పోస్టుపై సొంత పార్టీ నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఆయన ఏ పార్టీలో కొనసాగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. గత కొంతకాలంగా శశిథరూర్ ప్రధాని మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశంసిస్తుండటం కాంగ్రెస్ పార్టీకి ఆగ్రహం కలిగిస్తోంది.

# డ్రోన్లతో రాకెట్ దాడులకు ప్లాన్!

**ఢిల్లీ పేలుడు కేసు దర్యాప్తులో కీలక పురోగతి**



న్యూఢిల్లీ: ఢిల్లీలో జరిగిన కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సంచలన విషయాలు వెలుగులోకి తెచ్చింది. గత 48 గంటల్లో ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేయడంతో ఈ కేసుకు సంబంధించి ఓ భారీ ఉగ్ర కుట్ర బట్టబయలైంది. ఉగ్రవాదులు తొలుత కారు బాంబుతో కాకుండా, డ్రోన్ల సాయంతో రాకెట్ బాంబు దాడులు చేయాలని ప్లాన్ చేసినట్లు ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. హమాస్, ఐసిస్ వంటి ఉగ్రవాద సంస్థల తరహాలో డ్రోన్ టెక్నాలజీని మార్పులు చేసి, వాటి ద్వారా రాకెట్ బాంబులను ప్రయోగించి భారీ విధ్వంసం సృష్టించాలని నిందితులు ప్లాన్ చేశారు. ఈ కుట్ర అమలు కోసం పలువురు టెక్నికల్ నిపుణులను కూడా సంప్రదించినట్లు దర్యాప్తులో తేలింది. అయితే ఈ రాకెట్, డ్రోన్ దాడుల ప్రణాళిక విఫలమవడంతో, వారు కారు బాంబు దాడికి పాల్పడినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి సహకరించిన ఇద్దరిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. వీరిలో ఒకడైన జమ్మూకశ్మీర్‌కు చెందిన జసీర్ బిలాల్ వనీ అలియాస్ డానిస్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఇతడు డ్రోన్ల మార్పు, రాకెట్ బాంబుల తయారీకి టెక్నికల్ సపోర్ట్ అందించినట్లు ఎన్ఐఏ పేర్కొంది. పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్ అయిన వనీని.. ఉమర్ తీవ్రంగా ప్రభావితం చేసి ఆత్మాహుతి దాడికి సిద్ధం చేసినట్లు తెలిసింది. కారు బాంబు కోసం వాహనాన్ని సమకూర్చిన అమీర్ అనే మరో వ్యక్తిని కూడా అధికారులు అరెస్ట్ చేశారు. ఎర్రకోట సమీపంలో జరిగిన ఈ కారు బాంబు పేలుడులో 14 మంది మరణించగా, పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఆత్మాహుతి దాడికి పాల్పడింది అల్ ఫలా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ ఉమర్ ఉన్ నబీగా గుర్తించారు. ఈ 'వైట్ కాలర్ టెర్రర్ నెట్‌వర్క్'లో భాగమైన మరికొందరు డాక్టర్లను, నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేయగా.. కశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో సోదాలు కొనసాగుతున్నాయి.

**కారు బాంబు తయారు చేసిన నిందితుడి అరెస్ట్**

కారు బాంబును తయారు చేసిన కీలక నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎన్ఐఏ ప్రకటించింది. అనంతనాగ్‌లో జసీర్ బిలాల్ వాని అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. ఆత్మాహుతి బాంబర్ ఉమర్‌కు కారు బాంబును అందించింది బిలాలేనని అధికారులు తెలిపారు. అంతేకాకుండా, డ్రోన్లు, రాకెట్ల ద్వారా కూడా దాడులకు జసీర్ బిలాల్ కుట్ర పన్నినట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. ఇదే కేసులో ఆత్మాహుతి దాడికి కుట్ర పన్నిన అమీర్ రషీద్ అలీని ఆదివారం ఎన్ఐఏ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పేలుడుకు ఉపయోగించిన కారు అమీర్ పేరు మీదే రిజిస్టర్ అయి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నవంబర్ 10న జరిగిన ఈ పేలుడు ఘటనపై ఎన్ఐఏ లోతైన దర్యాప్తు కొనసాగిస్తోంది. పేలుడు కుట్రలో పాల్గొన్న వ్యక్తులు, సంస్థలను గుర్తించే పనిలో ఉంది. ఈ కేసులో ఇప్పటివరకు 73 మంది సాక్షులను విచారించారు. ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్ పోలీసుల సహకారంతో దర్యాప్తు వేగవంతంగా జరుగుతోంది.

# ఈవీఎంలలో ముందే 25 వేల ఓట్లు!

**ఆరోపించిన ఆర్జేడీ నేత**

**సాంకేతికంగా అసాధ్యం: ఈసీ**



న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే ఈవీఎంలలో 25 వేల ఓట్ల చొప్పున ఓట్లు పడ్డాయన్న ఆర్జేడీ సీనియర్ నేత జగదానంద సింగ్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. ఆయన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపింది. బీహార్ తీర్పు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించలేదని, ఈవీఎంలలో అవకతవకలు జరిగినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేకపోలేదని ఆర్జేడీ సోమవారం పేర్కొంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ప్రతి ఈవీఎంలలో 25 వేల ఓట్లు పడ్డాయని, అయినప్పటికీ తాము 25 సీట్లు సాధించామని జగదానంద సింగ్ అన్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం, ఇది సాంకేతికంగా అసాధ్యమని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో అనుసరించిన నిబంధనల ప్రకారం ఇవి తప్పుడు ఆరోపణలని పేర్కొంది. పోలింగ్‌కు ముందు 25 వేల ఓట్లు ఉండటం అనేది అసాధ్యమని తెలిపింది. ఈవీఎంలకు బ్లూటూత్, ఇంటర్నెట్, ఇతర కనెక్షన్లు ఏవీ ఉండవని గుర్తు చేసింది. బయటి నుంచి ఈవీఎంను యాక్సెస్ చేయడం లేదా డిజిటల్ ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని తెలిపింది. పోలింగ్‌కు ముందు ఈవీఎంలలో ప్రతి అభ్యర్థికి సున్నా ఓట్లు కనిపిస్తాయని తెలిపింది. పార్టీల ఏజెంట్ల సమక్షంలోనే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని తెలిపింది. ఆ తర్వాత మాక్ పోల్ ఓట్లను కూడా తొలగిస్తారని వెల్లడించింది. ఈవీఎంల పంపిణీ కూడా ర్యాండమ్‌గా ఉంటుందని, కాబట్టి ఏ ఓటింగ్ యంత్రం ఏ పోలింగ్ కేంద్రానికి వెళుతుందో ఎవరూ చెప్పలేరని స్పష్టం చేసింది. పోలింగ్ ప్రక్రియ ప్రతి దశలో పార్టీల ఏజెంట్లు ఉంటారని తెలిపింది. రెండు విడతల్లోనూ ఆర్జేడీ ఒక్కసారి కూడా అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల సంఘం తెలిపింది. జగదానంద్ సింగ్ కూడా ఆధారాలను సమర్పించలేదని వెల్లడించింది. మాక్ పోల్ సర్టిఫికెట్లు, ఫామ్ 17సీ, ఇతర పత్రాలపై ఆర్జేడీ సొంత ఏజెంట్లు సంతకం చేశారని తెలిపింది. కానీ ఇప్పుడు అందుకు విరుద్ధంగా ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొంది.

# అంబులెన్స్‌కు మంటలు

**నలుగురి సజీవ దహనం**

**గుజరాత్‌లో ఘోర అగ్నిప్రమాదం**



అహ్మదాబాద్: గుజరాత్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అర్వల్లీ జిల్లా మొదాస పట్టణం సమీపంలో ఓ అంబులెన్స్‌లో మంటలు చెలరేగి నవజాత శిశువు, డాక్టర్ సహా నలుగురు సజీవ దహనమయ్యారు. ఈ విషాద ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. మరో ముగ్గురు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టిన తర్వాత అనారోగ్యానికి గురైన ఒక రోజు పసికందును మెరుగైన చికిత్స కోసం మొదాసలోని ఆసుపత్రి నుంచి అహ్మదాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో మొదాస-ధన్సురా రహదారిపై అంబులెన్స్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పసికందుతో పాటు ఆ చిన్నారి తండ్రి జిగ్నేష్ మోచీ (38), డాక్టర్ శాంతిలాల్ రెంటియా (30), నర్సు భూరిబెన్ మానత్ (23) అక్కడికక్కడే మృతి చెందారు. అంబులెన్స్ వెనుక భాగంలో మంటలు చెలరేగడాన్ని గమనించిన డ్రైవర్ వాహనాన్ని నెమ్మది చేశాడు. ముందు సీట్లలో కూర్చున్న డ్రైవర్ అంకిత్ ఠాకూర్, జిగ్నేష్ బంధువులు గౌరంగ్ మోచీ, గీతాబెన్ మోచీ గాయాలతో బయటపడ్డారు. వెనుక భాగంలో ఉన్న నలుగురూ మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేలోపే జరగరాని నష్టం జరిగిపోయింది. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ నిపుణులను రంగంలోకి దించినట్లు జిల్లా ఎస్పీ మనోహర్‌సిన్హ్ జడేజా తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆరు రోజుల లాభాలకు బ్రేక్



ముంబై: వరుసగా ఆరు రోజుల పాటు లాభాల్లో దూసుకెళ్లిన దేశీయ స్టాక్ మార్కెట్లకు మంగళవారం బ్రేక్ పడింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 277.93 పాయింట్లు నష్టపోయి 84,673.02 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 103.40 పాయింట్లు కోల్పోయి 25,910.05 వద్ద ముగిసింది. ఉదయం సెషన్ ఫ్లాట్‌గా ప్రారంభమైనప్పటికీ, కొద్దిసేపటికే అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మార్కెట్లు నెగెటివ్ జోన్‌లోకి జారుకున్నాయి. ఇటీవల మార్కెట్లు పుంజుకోవడంతో ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరించారని, దీనికి బలహీన అంతర్జాతీయ సంకేతాలు తోడయ్యాయని విశ్లేషకులు తెలిపారు. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను డిసెంబర్‌లో తగ్గిస్తుందన్న అంచనాలు తగ్గడం, డాలర్ బలపడటం వంటి కారణాలతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో ఐటీ, మెటల్, రియల్టీ షేర్లు నష్టపోయాయి. అయితే, ప్రైవేట్ బ్యాంకులు కొంతమేర మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. ఈ వారం వెలువడనున్న అమెరికా ఉద్యోగ గణాంకాల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు. ఫెడ్ పాలసీ నిర్ణయాలపై ఈ డేటా ప్రభావం చూపనుంది. భవిష్యత్తులో ఇండో-యూఎస్ వాణిజ్య ఒప్పందంలో పురోగతి, దేశీయ కంపెనీల ఆర్థిక ఫలితాలు మార్కెట్లకు మద్దతునిస్తాయని నిపుణులు భావిస్తున్నారు. ఈరోజు ట్రేడింగ్‌లో దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ సూచీ అత్యధికంగా 1.10 శాతం పతనం కాగా, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా నష్టాలను చవిచూశాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోగా, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక శాతం మేర నష్టపోయాయి.

# నిలిచిపోయిన 'ఎక్స్'

**క్లౌడ్‌ఫ్లేర్ నెట్‌వర్క్‌లో సమస్య**

**లక్షల మంది యూజర్లకు ఇబ్బందులు**



న్యూయార్క్: ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ సేవలకు మంగళవారం ప్రపంచవ్యాప్తంగా అంతరాయం కలిగింది. భారత్‌లోని వేలాది మంది యూజర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేవలు అందించే క్లౌడ్‌ఫ్లేర్ నెట్‌వర్క్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగానే ఎక్స్‌తో పాటు పలు ఇతర వెబ్‌సైట్లు కూడా మొరాయించాయి. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5:20 గంటల సమయంలో ఈ సమస్య మొదలైంది. ప్రముఖ వెబ్‌సైట్ల డౌన్‌టైమ్‌ను పర్యవేక్షించే 'డౌన్ డిటెక్టర్' ప్రకారం, పది వేలకు పైగా యూజర్లు ఎక్స్ పనిచేయడం లేదని ఫిర్యాదు చేశారు. ఫీడ్ లోడ్ కాకపోవడం, వెబ్‌సైట్ ఓపెన్ అవ్వకపోవడం, లాగిన్ సమస్యలు, సర్వర్ కనెక్షన్ వైఫల్యాలు వంటి ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు యూజర్లు తెలిపారు. ఈ అంతరాయంపై క్లౌడ్‌ఫ్లేర్ సంస్థ స్పందించింది. తమ నెట్‌వర్క్‌లో సమస్య తలెత్తిన విషయం వాస్తవమేనని, దానిని పరిశీలిస్తున్నామని ప్రాథమికంగా వెల్లడించింది. అయితే, సమస్యకు కారణం ఏంటి, ఎప్పటికి పరిష్కరిస్తామనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఆసక్తికరంగా, ఔటేజ్‌లను ట్రాక్ చేసే డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ కూడా క్లౌడ్‌ఫ్లేర్‌పైనే ఆధారపడటంతో, అది కూడా లోడ్ అవ్వడానికి ఇబ్బంది పడింది. కాగా, ఎక్స్‌లో సాంకేతిక సమస్యలు రావడం ఇది కొత్తేమీ కాదు. ఈ ఏడాది మే నెలలో కూడా ఇలాగే ప్రపంచవ్యాప్తంగా ఎక్స్ సేవలు నిలిచిపోయాయి. ఆ సమయంలో కూడా యూజర్లు లాగిన్ అవ్వలేక, కొత్త పోస్టులు చూడలేక ఇబ్బంది పడ్డారు. అప్పుడు కూడా వేలాది మంది యూజర్లు ఫిర్యాదు చేసినా, సమస్యకు గల కారణాన్ని కంపెనీ ఇప్పటికీ వెల్లడించలేదు.

# ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది: జైశంకర్

మాస్కో: భారత ప్రజలను ఉగ్రవాదం నుంచి రక్షించుకునే హక్కు దేశానికి ఉందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. రష్యాలో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో ఆయన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గట్టిగా మాట్లాడారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని సహించకూడదని ఆయన అన్నారు. ఉగ్రవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించే ధోరణి ఉండకూడదని ఆయన తేల్చి చెప్పారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం అనేది ఉమ్మడి ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా జైశంకర్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్నారు. అంతకుముందు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్‌తో ఆయన సమావేశమయ్యారు. ఇరువురు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరిపినట్లు సమాచారం.

# ప్రతిపక్ష నేతగా ఉండను

**తేజస్వీయాదవ్ పట్టు.. ఒప్పించిన లాలు ప్రసాద్**



పాట్నా: బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉండేందుకు ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ తొలుత విముఖత చూపారు. ఇటీవలి బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. ఆర్జేడీ మాత్రం 25 స్థానాలకే పరిమితమైంది. ఎన్నికల్లో పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ ప్రతిపక్ష నాయకుడిగా ఉండడానికి ఆయన నిరాకరించినట్లు సమాచారం. అయితే, తండ్రి, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు లాలు ప్రసాద్ యాదవ్ నచ్చజెప్పడంతో ఆయన ఆ పదవిలో కొనసాగేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. తాను ప్రస్తుతానికి ఎమ్మెల్యేగా పనిచేయాలనుకుంటున్నానని, ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టడం ఇష్టం లేదని సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో తేజస్వి అన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో గెలుపు కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని, ఈ ఓటమికి తానే పూర్తి బాధ్యత వహిస్తానని ఆయన పేర్కొన్నారు. అయితే, పార్టీని ముందుండి నడిపించడానికి ప్రతిపక్ష నేత చాలా అవసరమని లాలు ప్రసాద్ యాదవ్ చెప్పడంతో తేజస్వి యాదవ్ అందుకు అంగీకరించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా, కొత్తగా ఎన్నికైన 25 మంది ఎమ్మెల్యేలు తమ శాసనసభాపక్ష నేతగా తేజస్వి యాదవ్‌ను ఎన్నుకున్నారని ఆర్జేడీ అధికార ప్రతినిధి శక్తి సింగ్ తెలిపారు.

# ఓటమికి 100 శాతం బాధ్యత నాదే

**మౌనదీక్ష చేపట్టబోతున్నా: ప్రశాంత్ కిశోర్**

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయానికి తానే పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు జన్ సురాజ్ పార్టీ అధినేత, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. ఫలితాల అనంతరం తొలిసారిగా మీడియాతో మాట్లాడిన ఆయన, తమ పార్టీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోలేకపోయిందని అంగీకరించారు. ఈ వైఫల్యానికి ప్రాయశ్చిత్తంగా ఈ నెల 20న గాంధీ భీతిహర్వా ఆశ్రమంలో ఒకరోజు మౌన ఉపవాసం చేయనున్నట్లు తెలిపారు. "బీహార్ రాజకీయాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో కొత్త పాత్ర పోషించాం. కానీ ప్రజలు మమ్మల్ని తిరస్కరించారు. మా ఆలోచనల్లోనే ఎక్కడో లోపం ఉండి ఉంటుంది. వంద శాతం బాధ్యత నాదే. చాలా నిజాయతీగా ప్రయత్నించాం, కానీ విఫలమయ్యాం. ఈ నిజాన్ని అంగీకరించడానికి ఎలాంటి ఇబ్బంది లేదు" అని ప్రశాంత్ కిశోర్ అన్నారు. గత మూడేళ్లుగా తన శక్తినంతా ధారపోసి పనిచేసినా ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని పీకే స్పష్టం చేశారు. బీహార్‌ను బాగు చేయాలనే తన సంకల్పం నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. "నేను తప్పులు చేసి ఉండొచ్చు, కానీ ఎలాంటి నేరం చేయలేదు. కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టలేదు. హిందూ-ముస్లిం రాజకీయాలు చేయలేదు. డబ్బులిచ్చి ఓట్లు కొనే నేరానికి పాల్పడలేదు" అని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేసిన ప్రశాంత్ కిశోర్ పార్టీ జన్ సురాజ్.. ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోవడమే కాకుండా, అభ్యర్థులంతా డిపాజిట్లు కోల్పోవడం గమనార్హం.

# ఆర్నెల్లైనా కోలుకోని పాక్

న్యూఢిల్లీ: ఈ ఏడాది మే నెలలో భారత్ జరిపిన సైనిక దాడుల నుంచి పాకిస్థాన్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దాడులు జరిగి ఆరు నెలలు గడిచినా, దెబ్బతిన్న సైనిక స్థావరాల్లో మరమ్మతులు ఇంకా కొనసాగుతున్నాయని తాజా శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రముఖ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ నిపుణుడు డేమియన్ సైమన్ తన విశ్లేషణ ద్వారా ఈ వివరాలను వెల్లడించారు. సైమన్ ఎక్స్ వేదికగా పంచుకున్న సమాచారం ప్రకారం రావల్పిండి సమీపంలోని నూర్ ఖాన్ వైమానిక స్థావరంపై భారత్ దాడి చేసిన ప్రదేశంలో పాకిస్థాన్ ఒక కొత్త నిర్మాణాన్ని చేపట్టింది. పాక్ అణ్వాయుధాలను పర్యవేక్షించే స్ట్రాటజిక్ ప్లాన్స్ డివిజన్ ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఈ ఎయిర్‌బేస్ ఉండటం గమనార్హం.

వయ్యారి చిత్రం






## సినిమాలకు గుడ్‌బై చెప్తున్నా

ప్రముఖ నటి, పలు సినిమాల్లో తల్లి పాత్రలతో మెప్పించిన తులసి తన సినీ ప్రస్థానానికి ముగింపు పలకాలని డిసైడ్ అయ్యారు. ఈ ఇయర్ డిసెంబర్ 31వ తేదీతో తాను యాక్టింగ్ నుంచి తప్పుకుంటున్నట్టు సోషల్ మీడియా వేదికగా అఫీషియల్ గా అనౌన్స్ చేయడంతో ఈ వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నాలుగేళ్ల వయసు నుంచే బాలనటిగా కెరీర్ ను మొదలుపెట్టిన తులసి తెలుగు, తమిళ, కన్నడ, భోజ్‌పురి భాషల్లో 300కి పైగా సినిమాలు చేశారు. కొన్ని సినిమాల్లో హీరోయిన్ గా కూడా నటించి గుర్తింపు పొందిన తులిసి మధ్యలో కన్నడ డైరెక్టర్ శివమణిని పెళ్లి చేసుకుని కొంత కాలం పాటూ యాక్టింగ్ నుంచి రెస్ట్ తీసుకున్నారు. ఆ తర్వాత మళ్లీ క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఎంట్రీ ఇచ్చి పలు సినిమాల్లో ఎంతో మంది హీరోలకు తల్లి పాత్రల్లో నటించి ఆడియన్స్ గుండెల్లో స్పెషల్ ప్లేస్ ను దక్కించుకున్నారు. ఈ డిసెంబర్ 31న షిర్డీ వెళ్తున్నానని, ఆ రోజే తన రిటైర్మెంట్ కూడా ఉంటుందని, రిటైర్మెంట్ తర్వాత సాయి బాబాకు సేవ చేసుకుంటూ బతికేస్తానని ఆమె తన పోస్ట్ లో పేర్కొన్నారు. ఈ పోస్ట్ చూసిన ఆమె అభిమానులు ఆమెకు దేవుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ కామెంట్స్ చేస్తున్నారు.

## ఆ నటికి తిండి తినే వ్యాధి!

దంగల్ చిత్రంలో క్రీడాకారిణిగా నటించింది ఫాతిమా సనా షేక్. ఆ సినిమా పాన్ ఇండియాలో సంచలన విజయం సాధించడమే గాక, చైనాలో ఇప్పటికీ అత్యధిక వసూళ్లను సాధించిన సినిమాగా రికార్డులకెక్కింది. ఈ సినిమాలో అమీర్ ఖాన్, సాన్య మల్హోత్రా తదితరులు నటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఫాతిమ దంగల్ చిత్రీకరణ సమయంలో తాను ఎదుర్కొన్న బులిమియా అనే వ్యాధి గురించి మాట్లాడింది. తనకు అతిగా తినే అలవాటుందని, ఒక్కోసారి ఆహారం విషంగా మారిపోతుందని వెల్లడించి షాకిచ్చింది. అయితే దంగల్ చిత్రీకరణ సమయంలో రోజూ 3 గంటల పాటు శ్రమించేదానిని.. కనీసం గంటన్నర సమయం జిమ్ కి కేటాయించేదానిని అని ఫాతిమా చెప్పింది. నేను నిరంతరాయంగా గంటల తరబడి తినగలను. సినిమా కోసం 3000 కేలరీలు పెరగాలి కాబట్టి బాగా తిన్నాను. కానీ దంగల్ చిత్రీకరణ అయిపోయాక కూడా అదే విధంగా తినడం కొనసాగించాను. ఒకానొక దశలో తిండిపై విసుగొచ్చింది. భయం వేసిందని తెలిపింది. అంతేకాదు దంగల్ సెట్స్ లో తనకు అతిగా తినే అలవాటుందని సహనటి సాన్య మల్హోత్రా గుర్తించినట్టు అంగీకరించింది ఫాతిమా.





## చిరు గురువు అస్తమయం

మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ రజినీకాంత్, బిగ్ బి అమితాబ్ బచ్చన్ లాంటి స్టార్ హీరోలకు యాక్టింగ్ లో మెలకువలు నేర్పిన కేఎస్ నారాయణ స్వామి తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా వయసు రీత్యా పలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కెఎస్ నారాయణ 92 ఏళ్ల వయసులో తన ఆఖరి శ్వాసను వదిలి తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. కెఎస్ నారాయణ స్వామి ఎంతో మందికి యాక్టింగ్ లో శిక్షణ ఇచ్చి చాలా మంది నటీనటుల్ని సినీ ఇండస్ట్రీకి అందించారు. 1960 రోజుల్లో సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ లో కెఎస్ నారాయణ స్వామి యాక్టింగ్ గురువుగా పనిచేశారు. ఆయన్ని అందరూ పూర్తి పేరుతో కాకుండా కెఎస్ గోపాలి అని పిలిచేవారు. యాక్టింగ్ గురువుగానే కాకుండా గోపాలికి దూరదర్శన్ కేంద్రానికి డైరెక్టర్ గా పని చేసిన ఎక్స్‌పీరియెన్స్ కూడా ఉంది.



## కన్ఫర్మ్‌గా భాగ్య శ్రీది లవ్ మ్యారేజ్!

గత ఏడాది రవితేజ హీరోగా వచ్చిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ భాగ్య శ్రీ బోర్సే ప్రస్తుతం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా ఉంది. ప్రస్తుతం ఆంధ్రా కింగ్ తాలూక సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీగా ఉన్న ఈ అమ్మడు మరిన్ని తెలుగు సినిమాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవలే ఈమె కాంత సినిమాతో వచ్చింది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన ఆ సినిమాలో భాగ్యశ్రీ నటనకు మంచి మార్కులు పడ్డాయి. పాత కాలం తరహా హీరోయిన్ పాత్రను పోషించి మెప్పించింది. ఆ సినిమా విభిన్నమైన అనుభవంను తనకు ఇచ్చింది అంటూ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో భాగ్యశ్రీ బోర్సే చెప్పుకొచ్చింది. ఆ ఇంటర్వ్యూలో తన పెళ్లి గురించి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం జరిగింది. ప్రస్తుతం ఆ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ఇంటర్వ్యూలో యాంకర్ మీరు లవ్ మ్యారేజ్ చేసుకుంటారా లేదంటే పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకుంటారా అని ప్రశ్నించిన సమయంలో ఆమె క్షణం ఆలోచించకుండా లవ్ మ్యారేజ్ చేసుకుంటాను అంటూ తేల్చి చెప్పింది. అప్పుడు యాంకర్ మీరు ఇప్పుడు ప్రేమలో ఉన్నారా అంటూ ప్రశ్నించింది. అందుకు వెంటనే లేదు, ప్రస్తుతానికి ప్రేమలో లేను అని చెప్పింది. ప్రేమలో లేకుండానే మీరు ప్రేమ వివాహం చేసుకుంటాను అని ఎలా చెబుతున్నారు అంటూ యాంకర్ ప్రశ్నించగా, తనకు ప్రేమ మీద విశ్వాసం ఎక్కువ అని, అందుకే ప్రేమ వివాహం చేసుకోవాలని అనుకుంటున్నట్లుగా చెప్పుకొచ్చింది.

### ఎన్‌బీకే111లో లేడీ సూపర్ స్టార్



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఎన్2బీకే111' నుంచి ఓ అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కథానాయికగా లేడీ సూపర్‌స్టార్ నయనతార నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. మంగళవారం నయనతార పుట్టినరోజును పురస్కరించుకుని ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా దర్శకుడు గోపీచంద్ మలినేని తన ఎక్స్ ఖాతాలో.. "క్వీన్ నయనతార గారికి స్వాగతం. మా కథలో ఆమె శక్తి, గాంభీర్యం ఉన్నందుకు గౌరవంగా భావిస్తున్నాం. మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు. మిమ్మల్ని త్వరలో సెట్‌లో కలుసుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం" అని పోస్ట్ చేశారు. నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ కూడా నయనతారకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.



## ధనుష్ మేనేజర్ కమిట్‌మెంట్ అడిగాడు

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మేనేజర్ శ్రేయాస్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తాయి. అతడు కమిట్ మెంట్ అడిగాడంటూ టీవీ నటి మాన్య ఆనంద్ ఆరోపించారు. అతడు చాలా కాలంగా అడ్జస్ట్‌మెంట్ గురించి అడుగుతున్నాడు. ధనుష్ నటించే కొత్త ప్రాజెక్టులో అవకాశం కల్పిస్తానంటూ అతడు నన్ను పిలిచి కొన్ని అభ్యంతరకరమైన అభ్యర్థనలు కూడా చేశాడని ఆమె పేర్కొంది. కమిట్మెంట్ కావాలని శ్రేయాస్ అడిగారు! అని ఆరోపించారు. ఏ కమిట్మెంట్? నేను ఎందుకు కమిట్మెంట్ ఇవ్వాలి అని తాను అతడిని ఎదురు ప్రశ్నించినట్టు కూడా నటి మాన్య వెల్లడించారు. ఆఫర్లు నాకు అవసరం లేదని చెప్పినా అతడు తనను బలవంతం చేస్తూనే ఉన్నాడని కూడా మాన్య ఆరోపించారు. ధనుష్ అయినా మీరు అంగీకరించరా? అని అడిగాడట. దీంతో పాటు ధనుష్ నిర్మాణ సంస్థ వుండర్‌బార్ ఫిల్మ్స్ లొకేషన్ వివరాలను కూడా శ్రేయాస్ తనకు పంపాడని తనను కలవమని కోరాడని మాన్య పేర్కొంది. అతడు స్క్రిప్టులు కూడా పంపాడు. కానీ నేను చదవలేదు. 'మేం ఆర్టిస్టులు మాత్రమే. నటులగా పని చేస్తున్నాం. మీరు మానుండి పనిని మాత్రమే తీసుకోండి. వేరే ఏదీ కోరవద్దు. మీ డిమాండ్లకు తలవొంచితే మమ్మల్ని వేరే పేరు పెడతారు!' అని కూడా తాను ధనుష్ మేనేజర్ శ్రేయాస్ తో అన్నట్టు తెలిపింది. ఇలాంటి పద్ధతులు మార్చుకోవాలని కూడా ఆమె సున్నితంగా సూచించారు. అయితే ధనుష్ లేదా శ్రేయాస్ ఇప్పటివరకు ఈ వాదనలకు స్పందించలేదు. ధనుష్ ప్రస్తుతం తేరే ఇష్క్ మే రిలీజ్ ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నారు. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కృతి సనోన్ కథానాయిక. ఈ సినిమా రాంజానా తరహాలో ఉండదని దర్శకుడు చెబుతున్నారు. దీనికి హిమాన్షు శర్మ- నీరజ్ యాదవ్ రచయితలు. ఎ.ఆర్ రెహమాన్ సంగీతం అందించారు. కాలంతో పాటే మారే ప్రేమను తెరపై చూపిస్తున్నామని ఆనంద్ ఎల్ .రాయ్ చెబుతున్నారు. తేరే ఇష్క్ మే 28 నవంబర్ 2025న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తమిళం, తెలుగు భాషలలో థియేటర్లలోకి రానుంది.

## ప్రతిరోజూ విజయం సాధించలేం: మనుభాకర్

పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలతో వార్తల్లో నిలిచిన మను భాకర్ మళ్లీ ఆ స్థాయిలో రాణించలేకపోతోంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో పతకాల వేట కొనసాగిస్తుందనుకుంటే అనూహ్యంగా ఖాళీ చేతులతో నిష్క్రమిస్తోంది. తాజాగా ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భాకర్ నిరాశపరిచింది. కైరో వేదికగా జరిగిన టోర్నీలో విఫలమైన ఆమె ఓటమిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఎవరైనా ప్రతిరోజూ విజయం సాధించలేరు, ఈ పరాజయం నుంచి చాలా నేర్చుకుంటాను అని అంటోంది విశ్వ విజేత. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో పతకం సాధించేలా కనిపించిన మను భాకర్ ఫైనల్లో తేలిపోయింది. ర్యాపిడ్ ఫైరింగ్ క్వాలిఫికేషన్‌లో 586 పాయింట్లు సాధించి టాప్–8లో నిలిచిన ఆమె.. ఫైనల్లో గురి తప్పింది. కేవలం రెండు సార్లు మాత్రమే లక్ష్యాన్ని సాధించి నిరాశపరిచింది. తన ఓటమిపై స్పందించిన ఆమె.. 'వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో పతకాలే లక్ష్యంగా పెట్టుకున్నాను. కానీ, మెరుగైన ప్రదర్శనే చేయలేదు. మంచి స్కోర్లే సాధించినా.. పోడియం మీద నిల్చోలేకపోయాను. నా టీమ్మేట్ ఇషా పతకం సాధించింది. క్రీడల్లో మనం ప్రతిసారి, ప్రతిరోజు గెలవలేం. కొన్నిసార్లు ఓడిపోతాం కూడా. నావరకైతే ఈ పోటీల్లో భారత్‌కు పతకం రావడమే ముఖ్యం. ఆ మెడల్ నేను సాధించినా.. మరొకరు గెలిచినా సంతోషమే. అందుకే ఇషా విజయాన్ని నేను ఎంజాయ్ చేస్తున్నా. ఏ స్పోర్ట్స్‌లో అయినా ఇలానే ఉండాలి.

## కోల్‌కతాలోనే టీమిండియా..!

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలిటెస్టులో భారత జట్టు పరాజయం పాలైంది. ఈ నెల 22 నుంచి గౌహతిలో రెండోటెస్టు జరుగనున్నది. అయితే, ఈ పరాజయంతో రెండురోజులు విశ్రాంతి తీసుకోవడానికి బదులుగా జట్టు శిక్షణ తీసుకోవడంలో నిమగ్నమైంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో భారత జట్టు సభ్యులు పలువురు మంగళవారం ప్రాక్టీస్ చేశారు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారతదేశం 0–1తో వెనుకపడింది. రెండోటెస్టును ఎలాగైనా సమయం చేసి సిరీస్‌ను సమం చేయాలని భావిస్తున్నది. కోచ్ గౌతమ్ గంభీర్ నాయకత్వంలో భారత ఆటగాళ్లు ఈడెన్ గార్డెన్స్‌లో శిక్షణ పొందారు. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ మాత్రం ప్రాక్టీస్‌లో కనిపించలేదు. చాలామంది బ్యాట్స్‌మెన్ ప్రాక్టీస్‌లో చెమటోడ్చారు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ ధ్రువ్ జురెల్, ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా నెట్స్‌లో బ్యాటింగ్ చేయగా.. ఆకాశ్‌దీప్, వాషింగ్టన్ సుందర్, కోల్‌కతాకు చెందిన పలువురు బౌలింగ్ చేశారు.

## లైలాతో సినర్ సంబురాలు

పురుషుల టెన్నిస్ స్టార్ జన్నిక్ సినర్ మరో టైటిల్ సాధించాడు. ఏటీపీ ఫైనల్స్‌లో తనకు తగ్గపోటీదారుడైన కార్లోస్ అల్కరాస్ ను చిత్తు చేసి ట్రోఫీని ఒడిసిపట్టాడీ ఇటలీ కెరటం. ఫైనల్లో విజయం తర్వాత ఆ అపూర్వ క్షణాలను ప్రత్యేకంగా మలచుకున్నాడు సినర్. తన ప్రేయసి లైలా హసనోవిక్ తో గెలుపు సంబురాలు చేసుకున్నాడీ విజేత. ఏటీపీ ఫైనల్లో గెలుపొందిన తర్వాత ఆమెను హత్తుకొని విజయాన్ని ఆస్వాదించాడీ టెన్నిస్ సంచలనం. ఆమెను హగ్ చేసుకొని 'నేను ట్రోఫీ సాధించాను' అని మురిసిపోయాడు. ఈమధ్యే తాము రిలేషన్‌షిప్‌లో ఉన్నామని సినర్ బాహాటంగా ప్రకటించాడు. వియన్నా ఓపెన్ టోర్నీలో విజయం తర్వాత మాట్లాడుతూ లైలా హసనోవిక్‌కు ధన్యవాదాలు తెలిపాడు. ఇప్పుడు ఏటీపీ ఫైనల్ తర్వాత వీరిద్దరూ కలిసి సెలబ్రేట్ చేసుకోవడంతో ఔను వీరు ప్రేమలో ఉన్నారనే విషయం ప్రపంచమంతా తెలిసిపోయింది.

## రస్సెల్‌పై కావ్యమారన్ గురి!

ఐపీఎల్ 2026 సీజన్ మినీ వేలం కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తమ వ్యూహాలను సిద్ధం చేస్తోంది. గత సీజన్‌లో తీవ్రంగా నిరాశపర్చిన 8 మంది ఆటగాళ్లను వేలంలోకి వదిలేసిన ఆరెంజ్ ఆర్మీ.. ప్రధాన ఆటగాళ్లను మాత్రం రిటైన్ చేసుకుంది. డిసెంబర్ 16న అబుదాబి వేదికగా జరిగే మినీ వేలంలో కత్తిలాంటి ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు కసరత్తులు చేస్తోంది. ముఖ్యంగా టీమ్ బలహీనతలను అధిగమించడంపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. 8 మంది ఆటగాళ్లను వదిలేయడం ద్వారా సమకూరిన రూ.25.50 కోట్ల పర్స్ మనీతో సన్‌రైజర్స్ హైదరాబాద్ వేలం బరిలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో ఆండ్రీ రస్సెల్, రవి బిష్ణోయ్, ఆకాశ్ దీప్‌పై కావ్యమారన్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది.

## నేనేమైనా హర్మన్‌ప్రీత్‌నా?

బంగ్లాదేశ్ మహిళల జట్టు కెప్టెన్ నిగర్ సుల్తానా సంచలన వ్యాఖ్యలు చేసింది. ఆటగాళ్లను, స్టంప్స్‌ను బ్యాట్‌తో కొట్టేందుకు తాను ఏమైనా హర్మన్‌ప్రీత్ కౌరానా? అని ప్రశ్నించింది. జట్టులోని జూనియర్ ప్లేయర్లను నిగర్ సుల్తానా కొడుతుందని బంగ్లాదేశ్ పేసర్ జహనారా ఆలమ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. అయితే ఈ వ్యాఖ్యలపై స్పందించిన నిగర్ సుల్తానా ఈ ఆరోపణలను ఖండించింది. ఈ క్రమంలో టీమిండియా మహిళల కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పేరు ప్రస్తావించింది.

# గంభీర్ వల్లే ఓటములు



**సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియాకు ఎదురైన ఓటమి నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గంభీర్ అనాలోచిత నిర్ణయాల కారణంగానే టీమిండియా విజయాలు అందుకోలేకపోతుందని అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు మండిపడుతున్నారు.**

**సోషల్ మీడియా వేదికగా గంభీర్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలోకి టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ చేరాడు. నేరుగా గంభీర్‌పై విమర్శలు చేయకపోయినా.. టీమిండియా మేనేజ్‌మెంట్ కారణంగానే ఘోర పరాజయాలను ఎదుర్కొంటుందని అభిప్రాయపడ్డాడు.**


ముఖ్యంగా జట్టు వాతావరణం దెబ్బతిన్నదని, టీమ్‌లో ఒక్క ప్లేయర్ కూడా స్వేచ్ఛగా ఆడలేకపోతున్నారని ఆరోపించాడు. జట్టులో పదే పదే మార్పులు చేయడంతో ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుందని తెలిపాడు. ఏ ఒక్క ప్లేయర్‌కు కూడా టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి మద్దతు లభించడం లేదన్నాడు. 'జట్టులో ఎవరు ఆడినా.. వారికి టీమ్ మేనేజ్‌మెంట్ మద్దతు ఉందనే భావనలో లేరు. ఒక్కరు కూడా ఆటగాళ్లను వెనకేసుకొని రావడం లేదు. జట్టులో ప్రతీ ఒక్కరు భయంతో ఉన్నారు. జట్టులో చోటు ఉంటుందో లేదోనని భయంతోనే ఆడుతున్నారు. ఒక్కరు కూడా స్వేచ్ఛగా ఆడటం లేదు. సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ చేసిన తర్వాత కూడా జట్టులో అతని చోటు ఖరారు కాలేదు. సెంచరీ తర్వాత అతను తిరిగి జట్టులోకి కూడా రాలేకపోయాడు. సాయి సుదర్శన్ 87 పరుగులు చేశాడు. అతను కూడా తదుపరి మ్యాచ్ ఆడలేదు. జట్టు అంతా గందరగోళంలో ఉంది.'అని తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మహమ్మద్ కైఫ్ చెప్పుకొచ్చాడు.

## గంభీర్ నిర్ణయంతో సుందర్ నాశనం

టీమిండియా స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను మూడో స్థానంలో ఆడించడంపై మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇది వాషింగ్టన్ సుందర్ కెరీర్‌కే ప్రమాదమని హెచ్చరించాడు. సౌతాఫ్రికాతో కోల్‌కతా వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా 30 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. స్పిన్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై భారత బ్యాటర్లు తేలిపోయారు. టీమిండియా స్పిన్ వికెట్‌ను తయారు చేయించుకొని నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే నాలుగో స్పిన్నర్‌గా జట్టులోకి తీసుకున్న వాషింగ్టన్ సుందర్‌ను బ్యాటర్‌గా వాడుకుంది. ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు పంపించింది. మిగతా బ్యాటర్ల కంటే మెరుగైన ప్రదర్శన చేసినా.. అతను బౌలింగ్ చేయలేదు. అయితే ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా సుందర్‌ను బ్యాటర్‌గా ఆడించడంపై దినేశ్ కార్తీక్ ఘాటుగా స్పందించాడు. ఇది సుందర్ కెరీర్‌కే ప్రమాదమని అభిప్రాయపడ్డాడు. 'టెస్ట్ క్రికెట్‌లో వాషింగ్టన్ సుందర్‌ను ఎలా చూస్తున్నారు? బ్యాటింగ్ ఆల్‌రౌండర్‌గా? లేక బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా? అతన్ని మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపించారు. బ్యాటింగ్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టాలని పరోక్షంగా సూచిస్తున్నారు. ఇది ఇలానే కొనసాగిస్తే అతను పూర్తిగా బ్యాటింగ్‌పైనే ఫోకస్ పెడుతాడు. అది అతని బౌలింగ్‌పై ప్రభావం చూపుతుంది. అతని బౌలింగ్ నాణ్యతను దెబ్బతీస్తోంది. వాషింగ్టన్ సుందర్ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో రాణించగలడు. కానీ అతన్ని బ్యాటర్‌గా ప్రమోట్ చేస్తే రెండింట్లో రాణించలేడు. మరిన్ని మ్యాచ్‌ల్లోనూ సుందర్‌ను మూడో స్థానంలో ఆడిస్తే అతని బౌలింగ్ దెబ్బతింటుంది. అది అతనికి కెరీర్‌కే ప్రమాదం.'అని దినేశ్ కార్తీక్ హెచ్చరించాడు. ఇరు జట్ల మధ్య రెండో టెస్ట్ శనివారం నుంచి గౌహతి వేదికగా ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఎలాంటి కాంబినేషన్‌తో బరిలోకి దిగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## దేశవాళీ ఆడకపోవడం వల్లే

సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియా ఓడిపోవడంపై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఘాటుగా స్పందించాడు. దేశవాళీ క్రికెట్ ఆడకుండా ఇంట్లో పడుకుంటే ఫలితాలు ఇలానే ఉంటాయని విమర్శించాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా గత ఆదివారం(నవంబర్ 16) ముగిసిన తొలి టెస్ట్‌లో టీమిండియా 30 పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. 124 పరుగుల లక్ష్యాన్ని భారత బ్యాటర్లు ఛేదించలేకపోయారు. ప్రత్యర్థికి స్పిన్ ఉచ్చును బిగించాలని చూసిన టీమిండియా.. అదే ఉచ్చులో పడి ఓటమిపాలైంది. పూర్తిగా బౌలింగ్‌కు అనుకూలంగా ఉండే వికెట్‌ను తయారు చేసుకొని మూల్యం చెల్లించుకుంది. దాంతో టీమిండియాపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరాజయంపై స్పందించిన గవాస్కర్.. భారత బ్యాటర్లు స్పిన్ ఆడకపోవడానికి గల కారణాన్ని వెల్లడించాడు. గతంలో తాను చెప్పినట్లుగానే భారత బ్యాటర్లు దేశవాళీ క్రికెట్ ఆడటం లేదని, దాంతోనే స్పిన్ బౌలింగ్‌ను ఆడలేకపోతున్నారని చెప్పాడు. వరల్డ్ బెస్ట్ పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొంటున్న భారత బ్యాటర్లు.. స్పిన్‌కు మాత్రం బెంబేలెత్తిపోతున్నారని విమర్శించాడు.



'మన జట్టులోని చాలా మంది ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ ఆడారు. డొమెస్టిక్ క్రికెట్ ఆడితే ఈ రకమైన స్పిన్ పిచ్‌లపై ఆడగలిగే సామర్థ్యం వస్తుంది. ఎందుకంటే దేశవాళీ స్థాయిలో కూడా జట్లు తీవ్రంగా పోటీ పడుతాయి. రంజీ ట్రోఫీ నాకౌట్‌కు అర్హత సాధించేందుకు కావాల్సిన పాయింట్ల కోసం శ్రమిస్తాయి. దేశవాళీ క్రికెట్‌లో ర్యాంక్ టర్నర్ పిచ్‌లు ఉంటాయి. కానీ మన ఆటగాళ్లు ఎవరూ దేశవాళీ క్రికెట్ ఆడటం లేదు. వాస్తవానికి మన ప్రస్తుత జట్టులో ఎంతమంది రంజీ ట్రోఫీ ఆడేందుకు ఇష్టంగా ఉన్నారు? ఎవరికీ ఇష్టం లేదు. ఎందుకంటే వారికి వర్క్‌లోడే అనే పదం ఒకటి సాకుగా ఉంది. వర్క్‌లోడ్‌ను సాకుగా చూపిస్తూ విశ్రాంతి తీసుకుంటున్నారు. ఫామ్ కోల్పోతేనే వారికి రంజీ క్రికెట్ గుర్తుకొస్తుంది. అంతే తప్పా ఎవరికి కూడా దేశవాళీ క్రికెట్ ఆడాలని లేదు. టర్నింగ్ పిచ్‌లతో విజయాలు సాధించాలని టీమ్‌మేనేజ్‌మెంట్ భావించవచ్చు. కానీ అలాంటి పరిస్థితుల్లో దేశవాళీ క్రికెట్ ఆడుతున్న ఆటగాళ్లను ఎంచుకోవాలి. అంతర్జాతీయ క్రికెట్ ఆడే ఆటగాళ్లకు ఇలాంటి పిచ్‌లపై ఆడే దమ్ములేదు. ఎందుకంటే వారికి ఇలాంటి పిచ్‌లపై ఆడిన మ్యాచ్ ప్రాక్టీస్ లేదు.'అని గవాస్కర్ విమర్శలు గుప్పించాడు.



## గైక్వాడ్‌ను ఆడించాలి

సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో గాయపడిన టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తదుపరి మ్యాచ్ ఆడటంపై సందేహాలు నెలకొన్నాయి. రెండో టెస్ట్ నుంచి అతనికి విశ్రాంతినిచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే అతని స్థానంలో బరిలోకి దిగే ఆటగాడు ఎవరా? అనేది తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే, కానీ టీమిండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా మాత్రం దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న రుతురాజ్ గైక్వాడ్‌ను జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. 'శుభ్‌మన్ గిల్ రెండో టెస్ట్ ఆడుతాడా? లేదా? అనే విషయంలో ఇంకా క్లారిటీ లేదు. కానీ ఒకవేళ అతను దూరమైతే.. అతని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ ఆడించాలి. అయితే ఇప్పటికే జట్టును ప్రకటించారు. అతన్ని ఎలా తీసుకుంటారనే ప్రశ్న రావచ్చు. అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్ సిద్ధంగా ఉన్నారు. ఈ ఇద్దరూ లెఫ్టార్మ్ బ్యాటర్లు. ఇప్పటికే తుది జట్టులో ఆరుగురు లెఫ్ట్ హ్యాండర్లు ఉన్నారు. వీరిద్దరిలో ఎవరిని తీసుకున్నా.. ఏడుగురు లెఫ్టార్మ్ బ్యాటర్లువుతారు. ఇది ఏ మాత్రం సమంజసం కాదు. అభిమన్యు ఈశ్వరన్, సర్ఫరాజ్ ఖాన్‌ల రూపంలో ప్రత్యామ్నాయం ఉన్నా.. రుతురాజ్ గైక్వాడ్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. అతను భారత్ ఏ తరఫున వన్డేల్లో పరుగులు రాబడుతున్నాడు. కానీ అతనికి భారత్ ఏ తరఫున రెడ్‌బాల్ క్రికెట్‌లో అవకాశం దక్కడం లేదు. రుతురాజ్, రంజీ, దులీప్ ట్రోఫీలో అద్భుతంగా రాణించాడు.'అని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు.

## హార్దిక్‌కు అవకాశం దక్కేనా?

**సౌతాఫ్రికాతో వన్డేలకు కోహ్లీ, రోహిత్ రీఎంట్రీ**



సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్ ముగిసిన వెంటనే టీమిండియా మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. నవంబర్ 30న రాంచీ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. గౌహతి వేదికగా జరిగే రెండో టెస్ట్ నవంబర్ 26న ముగియనుండగా.. నాలుగు రోజుల వ్యవధిలోనే వన్డే సిరీస్ మొదలవ్వనుంది. ఈ సిరీస్ ఆడే భారత జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) త్వరలోనే ప్రకటించనుంది. టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో రీఎంట్రీ ఇవ్వనుండగా.. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా బరిలోకి దిగడంపై సందేహాలు నెలకొన్నాయి. ఆసియా కప్ సందర్భంగా గాయపడిన హార్దిక్ పాండ్యా.. ఆస్ట్రేలియా పర్యటనకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న హార్దిక్ పాండ్యా.. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ సాధించేందుకు శ్రమిస్తున్నాడు. భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చే ముందు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హార్దిక్ పాండ్యా ఫామ్ నిరూపించుకోనున్నాడు. నవంబర్ 26న జరిగే మొదటి మ్యాచ్ లేదా నవంబర్ 28న జరిగే రెండవ మ్యాచ్‌లో బరోడా తరఫున హార్దిక్ బరిలోకి దిగే అవకాశం ఉంది. హార్దిక్ పాండ్యా, శ్రేయస్ అయ్యర్ మినహా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత వన్డే జట్టులో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ఈ వన్డే సిరీస్ ముగిసిన వెంటనే ఐదు టీ20ల సిరీస్ జరిగే అవకాశం ఉంది. ఈ సిరీస్ నేపథ్యంలో వన్డే సిరీస్ నుంచి హార్దిక్ పాండ్యాతో పాటు జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతినివ్వనున్నారు. మెడ నొప్పితో బాధపడుతున్న శుభ్‌మన్ గిల్‌కు వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి ఇస్తారా? లేక కొనసాగిస్తారా? అనేది చూడాలి. వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా గాయంతో జట్టుకు దూరమయ్యాడు. దీంతో కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్‌కు అవకాశం దక్కవచ్చు. పేసర్లుగా ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్‌లో ముగ్గురికి మాత్రమే అవకాశం దక్కనుంది. స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ కొనసాగనున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్స్‌గా అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ బరిలోకి దిగనున్నారు. వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఆడనుండగా.. అతనికి బ్యాకప్‌గా రిషభ్ పంత్ రీఎంట్రీ ఇవ్వవచ్చు. ఎక్స్‌ట్రా బ్యాటర్‌గా యశస్వి జైస్వాల్ అవకాశం అందుకోనున్నాడు. పేస్ ఆల్‌రౌండర్లు శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిలో ఒకరికి చోటు దక్కనుంది.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
బుధవారం 19-11-2025 | www.evarthalu.com

# అపర దుర్గ.. ఝాన్సీ లక్ష్మీబాయి



భారత స్వాతంత్ర్య సంగ్రామంలో, ముఖ్యంగా 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో, వీరత్వానికీ, త్యాగానికీ ప్రతీకగా నిలిచిన మహారాణి ఝాన్సీ లక్ష్మీబాయి (మణి కర్ణిక) చరిత్ర తరతరాలకు స్ఫూర్తిదాయకం. కేవలం 29 ఏళ్ల చిన్న వయసులోనే అసామాన్య ధైర్యసాహసాలు ప్రదర్శించి, బ్రిటీష్ పాలకులకు కంటిమీద కునుకులేకుండా చేసిన అపర దుర్గ ఆమె. లక్ష్మీబాయి 1828 నవంబర్ 19న వారణాసి (కాశీ)లో మోరోపంత్ తాంబే, భాగీరథీబాయి దంపతులకు జన్మించారు. ఆమె అసలు పేరు మణి కర్ణిక. చిన్ననాటి నుండే గుర్రపు స్వారీ, కత్తియుద్ధాలు, ఆయుధ శిక్షణలో నైపుణ్యం సాధించారు. 1842లో ఝాన్సీ సంస్థానాధీశుడు గంగాధరరావు నెవాల్కర్‌ను వివాహం చేసుకుని ఝాన్సీ రాణిగా మారారు.

వివాహానంతరం ఆమె పేరు లక్ష్మీబాయి అయ్యింది. 1853లో గంగాధరరావు మరణానంతరం, రాణి దత్తత తీసుకున్న కుమారుడు దామోదర్ రావు వారసత్వాన్ని బ్రిటిష్ గవర్నర్–జనరల్ లార్డ్ డల్హౌసీ అంగీకరించలేదు. 'డాలీ' దత్తత నిషేధ చట్టం ప్రకారం, వారసులు లేని సంస్థానాలను బ్రిటిష్ సామ్రాజ్యంలో కలుపుకునేందుకు ప్రయత్నించారు. దీంతో బ్రిటిష్ నిర్ణయాన్ని ఎదిరించి, తన ఝాన్సీ సంస్థానాన్ని కాపాడుకోవడానికి లక్ష్మీబాయి సన్నద్ధమయ్యారు. 'నేను నా ఝాన్సీని వదులుకోను' ("మై అప్నీ ఝాన్సీ నహీ దూంగీ") అనే ఆమె నినాదం యావత్ దేశానికి పోరాట స్ఫూర్తిని ఇచ్చింది. 1857లో దేశవ్యాప్తంగా తిరుగుబాటు ప్రారంభం కాగా, రాణి లక్ష్మీబాయి ఉత్తర భారతదేశంలో తిరుగుబాటు దళాలకు నాయకత్వం వహించారు. ఆమె సైన్యంలో మహిళా దళాలు కూడా ఉండటం విశేషం. 1858లో సర్ హ్యూ రోజ్ నేతృత్వంలోని భారీ బ్రిటిష్ సేన ఝాన్సీ కోటను ముట్టడించింది. సుమారు రెండు వారాల పాటు రాణి కోటను అద్భుతంగా, ధైర్యంగా రక్షించారు. చివరికి ద్రోహం కారణంగా కోట పతనమయ్యే స్థితికి చేరుకుంది. వీరోచిత పోరాటం తర్వాత, కోటను బ్రిటిష్ సేన ఆక్రమించకముందే, రాణి తన కుమారుడిని వీపున కట్టుకుని, గుర్రంపై ఎక్కి ధైర్యంగా కోట గోడ దూకి తప్పించుకున్నారు. ఇది ఆమె అపారమైన ధైర్యానికి, వ్యూహాత్మక సామర్థ్యానికి నిదర్శనం. తప్పించుకున్న అనంతరం రాణి, తాత్యా తోపేతో కలిసి గ్వాలియర్ వైపు పయనమయ్యారు. అక్కడ సైన్యాన్ని సమకూర్చుకుని, గ్వాలియర్ కోటను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. 1858, జూన్ 17న కోట పరిసరాల్లో జరిగిన భీకర యుద్ధంలో రాణి లక్ష్మీబాయి నేరుగా బ్రిటిష్ దళాలతో పోరాడారు. అసామాన్య ధైర్యంతో పోరాడుతూ ఆమె యుద్ధభూమిలో వీరమరణం పొందారు. రాణి పోరాటాన్ని చూసిన బ్రిటిష్ కమాండర్ సర్ హ్యూ రోజ్, ఆమెను 'తిరుగుబాటుదారులలోకెల్లా అత్యంత ధైర్యవంతురాలు' అని ప్రశంసించారు. ఝాన్సీ లక్ష్మీబాయి కేవలం ఒక రాణిగా మాత్రమే కాకుండా, స్వాతంత్ర్య కాంక్షకు, స్త్రీ శక్తికి, అకుంఠిత పోరాట స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఆమె త్యాగం భారత దేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించదగినది.

## మహిళా సాధికారతకు ఆదర్శం

సాధారణంగా పాలన, యుద్ధరంగం పురుషులకే పరిమితమైన 19వ శతాబ్దంలో, లక్ష్మీబాయి స్వయంగా రాజ్యాధికారాన్ని స్వీకరించారు. ఆమె కేవలం రాణిగా మాత్రమే కాక, యుద్ధ భూమిలో ముందుండి తన దళాలకు నాయకత్వం వహించారు. ఈ అంశం, మహిళలు ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాలను అధిరోహించగలరని, క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించగలరని నిరూపించింది. ఆమె పోరాటం కేవలం రాజ్యం కోసమే కాదు, ఆత్మగౌరవం కోసమూ, విదేశీ దౌర్జన్యాన్ని అంగీకరించకుండా స్వతంత్రంగా బతకడం కోసమూ. ఒక మహిళ తన అస్థిత్వాన్ని, హక్కులను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉండాలని ఆమె జీవితం సందేశాన్ని ఇస్తుంది. ఆనాటి సాంప్రదాయాలకు భిన్నంగా, ఆమె చిన్నప్పటి నుంచే గుర్రపుస్వారీ, కత్తియుద్ధాలు, ఆయుధ శిక్షణలో నైపుణ్యం సాధించారు. అంతేకాక, ఆమె తన సొంత మహిళా సైన్యాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇది నేటి మహిళలు కూడా తమ స్వయం రక్షణ కోసం, శారీరక, మానసిక బలాన్ని పెంపొందించుకోవడానికి స్ఫూర్తినిస్తుంది. లక్ష్మీబాయి జీవితం, భారతీయ స్త్రీకి మాతృత్వం, పాలకురాలు, యోధురాలు అనే మూడు రూపాలు ఒకే చోట సాధ్యమని చూపిన అద్భుత ఉదాహరణ. ఆమె సాహసం నేటి యువతకు, ముఖ్యంగా మహిళలకు, తమ లక్ష్యాలను సాధించడానికి మార్గదర్శకం. ఝాన్సీ లక్ష్మీబాయి కేవలం చరిత్ర పేజీల్లో ఒక రాణిగా మిగిలిపోలేదు. ఆమె ధైర్యం, త్యాగం, దృఢ సంకల్పం నేటి మహిళలు ఎదుర్కొనే ప్రతి సవాలుకు ధైర్యంగా నిలబడే శక్తిని, స్ఫూర్తిని అందిస్తూనే ఉన్నాయి.

**- పూరడి విద్యారాణి**

సమాజంలో, కుటుంబంలో పురుషులు పోషిస్తున్న కీలక పాత్రను గుర్తించి, వారి ఆరోగ్యం, శ్రేయస్సు (వెల్‌బీయింగ్)పై దృష్టి సారించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం నవంబర్ 19న అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఈ రోజు, పురుషులు ఎదుర్కొంటున్న మానసిక, సామాజిక సవాళు,, అలాగే సమాజానికి వారు చేసిన సానుకూల సహకారంపై చర్చించేందుకు ఒక వేదికగా నిలుస్తుంది. ఈ సంవత్సరం (2025) అంతర్జాతీయ పురుషుల దినోత్సవం థీమ్‌గా "పురుషులకు, బాలలకు మద్దతు" అనే నినాదాన్ని ఎంపిక చేశారు.



...నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం...

# సోదరా.. నీకు నమస్తే!

ఇది పురుషుల జీవితాలను మెరుగుపరచడానికి, ముఖ్యంగా యువకులు తమ జీవితంలో సానుకూల పాత్రికేయులుగా ఎదగడానికి అవసరమైన సహాయక వాతావరణాన్ని సృష్టించడంపై దృష్టి పెడుతుంది. పురుషులలో పెరిగిపోతున్న మానసిక ఒత్తిడి, ఆత్మహత్యల రేటు, అలాగే ఇతర ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచడం ఈ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యం. కుటుంబం, సమాజం, దేశ నిర్మాణంలో కృషి చేస్తున్న మంచి తండ్రులు, సోదరులు, భర్తలు మరియు నాయకులను ఈ సందర్భంగా గౌరవించడం జరుగుతుంది. మహిళా దినోత్సవం (మార్చి 8) మాదిరిగానే, ఈ దినోత్సవం కూడా లింగ సమానత్వాన్ని, మెరుగైన లింగ సంబంధాలను ప్రోత్సహించడానికి ఒక అవకాశంగా ఉపయోగపడుతుంది. ఈ దినోత్సవం 1999లో ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన డాక్టర్ జెరోమ్ టీలక్సింగ్చే ప్రారంభించబడింది. తన తండ్రి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన ఈ తేదీని ఎంచుకున్నారు. అప్పటినుండి 80కి పైగా దేశాలలో దీనిని జరుపుకుంటున్నారు. పురుషులు కుటుంబ బాగోగులు చూసేందుకు, ఆర్థిక స్థిరత్వం కల్పించేందుకు నిరంతరం శ్రమిస్తారు. తరచుగా వారి భావోద్వేగాలను, కష్టాలను వ్యక్తం చేయకుండా మౌనంగా భరిస్తుంటారు. ఈ రోజు, వారి త్యాగాలు, నిస్వార్థ కృషిని గుర్తించి వారికి ధన్యవాదాలు చెప్పాల్సిన అవసరం ఉంది. పురుషులు తమ మానసిక, శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అవసరమైతే సహాయం తీసుకోవడానికి సంకోచించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటూ, బలమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని ఈ పురుషుల దినోత్సవం సందేశం ఇస్తోంది.

...నేడు ప్రపంచ టాయిలెట్ దినోత్సవం...




# 360 కోట్ల మందికి పారిశుధ్య సమస్యలు!

ప్రపంచ జనాభాలో దాదాపు 360 కోట్ల మంది ప్రజలకు ఇంకా సురక్షితమైన పారిశుధ్య సదుపాయాలు అందుబాటులో లేవు. బహిరంగ మల విసర్జన మరియు అపరిశుభ్రమైన టాయిలెట్ల కారణంగా కలరా, టైఫాయిడ్, అతిసారం (డయేరియా) వంటి ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలుతున్నాయి. సురక్షితమైన పారిశుధ్యం లేకపోవడం ప్రతి సంవత్సరం ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఐదు సంవత్సరాలలోపు వయసున్న అనేక మంది పిల్లల మరణానికి కారణమవుతోంది. ముఖ్యంగా బహిరంగ మల విసర్జనకు వెళ్లడం వల్ల మహిళలు, బాలికలు భద్రత, గౌరవానికి సంబంధించిన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. అందుకే, మెరుగైన పారిశుధ్యం (శానిటేషన్) ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేయడానికి, సురక్షితమైన టాయిలెట్ల లభ్యత లేని దాదాపు సగం ప్రపంచ జనాభాకు మద్దతుగా నిలిచేందుకు ప్రతి సంవత్సరం నవంబర్ 19న ప్రపంచ టాయిలెట్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం, పారిశుధ్య సంక్షోభాన్ని పరిష్కరించడానికి, 2030 నాటికి అందరికీ సురక్షితమైన టాయిలెట్ల లభ్యత లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేస్తోంది. భారతదేశంలో 'స్వచ్ఛ భారత్ మిషన్' ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కోట్ల సంఖ్యలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టింది. ఈ కార్యక్రమం పారిశుధ్యం, ప్రజారోగ్య ప్రమాణాలను మెరుగుపరచడంలో, బహిరంగ మల విసర్జనను తగ్గించడంలో గణనీయమైన పురోగతిని సాధించింది. అయితే, నిర్మించిన టాయిలెట్లను సరైన పద్ధతిలో నిర్వహించడం, ఉపయోగించడంపై ఇంకా అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు, సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణపై దృష్టి సారించాలి. టాయిలెట్ వాడిన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించాలి. టాయిలెట్ల నుండి వచ్చే మురుగునీటిని భూగర్భ జలాలలోకి వదలకుండా, దానిని శుద్ధి చేసి తిరిగి ఉపయోగించేందుకు సాంకేతికతను అభివృద్ధి చేయాలి. **- రాజు యాదవ్, సామాజిక కార్యకర్త**

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.